




మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

PRGI: APTEL/26/A2367

జాతీయ తెలుగు దినపత్రిక

www.swarnasagaram.com

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 1 | సంచిక : 81 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | బుధవారం 6 మే 2026 | వెల : 2-00







## విశాఖ కేంద్రంగా

# కొత్త రైల్వేజోన్

- ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది: సీఎం చంద్రబాబు
- విశాఖ రైల్వే జోన్ గెజిట్ విడుదలపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం
- ఏపీ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి గెజిట్ విడుదల చేసిన ప్రధాని మోదీ, రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం ధన్యవాదాలు



స్వర్ణసాగరం అమరావతి

సాగర తీర నగరమైన విశాఖ కేంద్రంగా కొత్త రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతో దోహదం చేస్తుందని నేతలు సంబరపడుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడి తమ బిడ్డల భవిష్యత్ బాగుంటుందని స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం - మిగతా3లో



## తిరుమలకు

# పోటెత్తుతున్న భక్తులు

- సత్ఫలితాలనిస్తున్న టీటీడీ వేసవి ప్రణాళికలు
- మూడురోజుల్లో రెండున్నర లక్షల మందికి అవకాశం
- ఫలిస్తున్న టీటీడీ ప్రణాళిక
- ఏఐ ఆధారిత సీసీ కెమెరాల ద్వారా మాడవీధులు, క్యూకాంప్లెక్స్‌లను పర్యవేక్షిస్తున్న అధికారులు



# పాక్‌పై భారత్‌దే సంపూర్ణ ఆధిపత్యం

- యుద్ధంలో ఇండియాదే విజయం'
- ఆపరేషన్ సిందూర్‌పై స్పందించిన యుద్ధ విశ్లేషకుడు టామ్ కూపర్
- పాక్‌పై భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించదని వెల్లడి
- ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించేంత స్థాయి పాక్‌కు లేదని వ్యాఖ్య



## బంగాల్ పరిశీలకుడిగా

# అమిత్‌షా

- అసోంకు జేపీ నడ్డా
- బీజేపీ అధిష్ఠానం నిర్ణయం
- శాసనసభాపక్ష నేతల ఎన్నికపై బీజేపీ అధిష్ఠానం దృష్టి సారింపు
- అసోం పరిశీలకుడిగా కేంద్రమంత్రి జేపీ నడ్డా
- సహపరిశీలకుడిగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ- బీజేపీ ప్రకటన

# 7న విజయ్ ప్రమాణస్వీకారం?

- టీవీకే గెలుపు తర్వాత తొలిసారి ట్వీట్
- తమిళనాడు అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తా
- రాష్ట్ర ప్రయోజనాలే తొలి ప్రాధాన్యం
- మోదీ శుభాకాంక్షలకు ధన్యవాదాలు తెలియజేసిన విజయ్



# సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదు

బంగాల్ ఎన్నికల నిర్వహణపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఘాటు విమర్శలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాము ప్రజా తీర్పు వల్ల ఓడిపోలేదని, కుట్రతో పరాజయం పాలైనట్లు పేర్కొన్నారు. అందుకే తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తేలేదని ఆమె తేల్చి చెప్పారు. బంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత తనకు సంఘీభావం తెలిపేందుకు కాంగ్రెస్? అధినేత్రి సోనియా, అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేశారని చెప్పారు. ఇకపై తాను ఇండియా కూటమిని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని వ్యాఖ్యానించారు. "బంగాల్ సీఎం పదవికి రాజీనామా చేయను. లోక్‌భవన్‌కు వెళ్లను. గవర్నర్‌కు రాజీనామా ఇవ్వను. ఎందుకంటే, లెక్కింపు ప్రక్రియలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయి. దాదాపు 100 స్థానాల్లో ప్రజా తీర్పును దోచుకున్నారు. పార్టీ మనోధైర్యాన్ని దెబ్బతీయడానికి ఉద్దేశపూర్వకంగా కౌంటింగ్?ను నెమ్మదింపజేశారు. ఇకపై అధికారం లేకపోయినా పోరాటం చేస్తాం. ఇంత దారుణంగా నిర్వహించిన ఎన్నికలను ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరించింది. కేంద్రం నియంత్రణలో ఈసీ పనిచేసింది."

**'బంగాల్‌లో బీజేపీతో కాకుండా ఈసీతో పోరాడాం'**

అయితే, ఈ ఎన్నికల్లో టీఎంసీ పోటీ బీజేపీకి వ్యతిరేకంగా కాదని, ఆ పార్టీ కోసం పనిచేసిన ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగానేనని మమత ఆరోపించారు. ఇకపై ఈసీపై ఎలా పోరాడాలో పార్టీలో చర్చించి, ముందుకెళ్తామని చెప్పారు. అదే



సమయంలో అసెంబ్లీ ఎన్నికల్లో పౌరుల ప్రజాస్వామ్య హక్కులను, ఈవీఎంలను లూటీ చేయడానికి సీఈసీ విలన్‌గా మారారని మమత ఆరోపించారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత కూడా ఈవీఎంలలో 80-90 శాతం ఛార్జింగ్ ఎలా ఉంటుంది? ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మట్నదటి రౌండ్ కౌంటింగ్ పూర్తయ్యాక బీజేపీకి 195-200 సీట్లు రాబోతున్నాయని ఎలా చెప్పారన్నారు. అదేవిధంగా, కౌంటింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న గందరగోళాన్ని కూడా మమత వివరించారు. ఐదు రౌండ్లు మిగిలి ఉండగా తాను 30,000 ఓట్ల ఆధిక్యంలో ఉన్నప్పుడు, బీజేపీ అభ్యర్థులు 200 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది, 200 మంది బయటి గూండాలతో ప్రాంగణంలోకి ప్రవేశించారని ఆమె పేర్కొన్నారు. వెంటనే బీజేపీ నాయకులు కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లి కౌంటింగ్ ఏజెంట్లను కొట్టడం ప్రారంభించారని ఆమె చెప్పారు. తాను కొన్ని నిమిషాలు కౌంటింగ్ కేంద్రంలో ఉన్నానని, ఆ సమయంలో కడుపు, వెనక భాగంలో కొట్టారని ఆరోపించారు. అంతేకాదు, తన పట్ల దురుసుగా ప్రవర్తించారన్నారు. అయితే, ఆ సమయంలో సీసీటీవీని ఆఫ్ చేశారని తెలిపారు. మరోవైపు, ఎన్నికల సమయంలో బంగాల్ పోలీసులు అచేతనంగా ఉండిపోయారని ఆమె వ్యాఖ్యానిం చారు. కేంద్రబలగాలు కూడా ఈసీతో కుమ్మక్కై కౌంటింగ్ కేంద్రాల్లో తమ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. మహిళనైన తనతోనే అనుచితంగా ప్రవర్తించారని మండిపడ్డారు. ఎన్నికల ఫలితాల అనంతరం, తమ పార్టీ కార్యాలయాలపైనా దాడులు చేస్తున్నారని మమత తెలిపారు. అయితే, హింసతో ప్రభావితమైన ప్రాంతాలను సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేయడానికి 10 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తామని మమత పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 206 స్థానాలు గెలుచుకుని, రాష్ట్రంలో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసుకుంది. అంతేకాదు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుచుకున్న 77 స్థానాల సంఖ్యను ఆ పార్టీ అధిగమించింది. మరోవైపు, గత అసెంబ్లీ ఎన్నికల్లో 212 సీట్లు గెలుచుకుని ఘనవిజయం సాధించిన తృణమూల్ కాంగ్రెస్, ఈసారి 80 సీట్లతో వెనుకబడి రెండో స్థానానికి పరిమితమైంది.

# బంగాల్ పరిశీలకుడిగా అమిత్‌షా

బంగాల్, అసోం, పుదుచ్చేరిలో విజయం సాధించటంతో శాసనసభాపక్ష నేతల ఎన్నికపై బీజేపీ అధిష్ఠానం దృష్టిసారించింది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బంగాల్?లో ఎన్నికల్లో హ్యాట్రిక్? సాధించిన బీజేపీ ఆ రాష్ట్రంలో కేంద్ర పరిశీలకులను నియమించింది. ఈ సందర్భంగా బంగాల్ పరిశీలకుడిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సహపరిశీలకుడిగా ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంఝీని నియమించింది. బంగాల్ ముఖ్యమంత్రి అంశంపై పరిశీలకులు తొలుత ఎమ్మెల్యేలతో చర్చించనున్నారు. అనంతరం శాసనసభాపక్షనేతను ఎన్నుకోనున్నారు. అసోం పరిశీలకుడిగా కేంద్రమంత్రి జేపీ నడ్డా, సహపరిశీలకుడిగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీని నియమిస్తూ బీజేపీ ప్రకటన విడుదల చేసింది. అసోంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ చరిత్ర సృష్టించింది. దీంతో మరోసారి హిమంతబిశ్వశర్మ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే అవకాశం ఉంది. మరోవైపు, పుదుచ్చేరి పరిశీలకుడిగా కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయను నియమించింది. మరోవైపు, బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ కనీవినీ ఎరుగని రీతిలో విజయ దుందుభి మోగించింది. దీంతో చాలా చోట్ల సంబరాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం బంగాల్? రాష్ట్ర సచివాలయం నబన్నాలో ప్రభుత్వ ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. రాజకీయ మార్పు పట్ల ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాషాయ జెండాలను ఊపుతూ నినాదాలు చేశారు. హౌరాలోని బహుళ అంతస్తుల భవనంలో 'జై శ్రీరామ్',



'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం' అంటూ నినాదాలు చేశారు. నబన్నా లోపల తాము ఇంతకు ముందు ఇలాంటి దృశ్యాలు చూడలేదని, ఉద్యోగుల బృందం అకస్మాత్తుగా నినాదాలు చేయడం ప్రారంభించారని ఓ అధికారి పేర్కొన్నారు. అయితే, పరిస్థితి ప్రశాంతంగా ఉందని ఆయన తెలిపారు. వారి నినాదాల వల్ల ఎలాంటి ఘర్షణ గానీ, పనిలో అంతరాయం గానీ కలగలేదని చెప్పారు. అయితే, అకస్మాత్తుగా వారు చేసిన ఆ నినాదాలు చాలా మందిని ఆశ్చర్యపరిచాయని అన్నారు.

**'గత 15 ఏళ్ల దుష్పరిపాలన నుంచి విముక్తి లభించింది'**

"ఈ రోజు మేం చాలా సంతోషంగా ఉన్నాం. మేం మార్పు కోసమే ఓటు వేశాం. చివరికి అది సాధ్యమైంది. ఈ రోజు మేం ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా మాట్లాడగలుగు తున్నాం. మొత్తానికి గత 15 ఏళ్ల దుష్పరిపాలన నుంచి విముక్తి లభించింది. మేం కష్టాలను ఎదుర్కొన్నప్పుడు కూడా మాట్లాడలేకపోయాం. ఈ రోజు ఆ భయాలు పూర్తిగా తొలగిపోయాయి" అని ఓ అధికారి పేర్కొన్నారు. మరోవైపు, బంగాల్?లో నూతనంగా కొలువుదీరే ప్రభుత్వంపై ఆ రాష్ట్ర ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. కొత్త ప్రభుత్వం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను, ముఖ్యంగా కరువు భత్యం (డీఏ)కు సంబంధించిన బకాయిలను పరిష్కరిస్తుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఎన్నికల ప్రచార సమయంలో, బంగాల్‌లో అధికారంలోకి వస్తే బీజేపీ 7వ వేతన సంఘాన్ని అమలు చేస్తుందని, 45 రోజుల్లోగా డీఏ బకాయిలను చెల్లిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగుల ఆశలు చిగురించాయి. ఇదిలా ఉండగా, బంగాల్? అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు యావత్ భారతావని దృష్టిని ఆకర్షించాయి. సోమవారం కౌంటింగ్? రోజు బీజేపీ, టీఎంసీ మధ్య పోరు హోరాహోరీగా కొనసాగింది. చివరికి మమత కంచుకోటను బద్దలు చేస్తూ బీజేపీ భారీ విజయాన్ని సాధించింది. బంగాల్?లోని 293 స్థానాల్లో 207 స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. తృణమూల్? కాంగ్రెస్?(టీఎంసీ) 80 స్థానాలను సొంతం చేసుకుంది. దీంతో టీఎంసీ 15 ఏళ్ల నిరంతర పాలనకు బీజేపీ ఓ ముగింపు పలికింది.

## ఒకే కుటుంబం- 3పార్టీల నుంచి ముగ్గురు పోటీ చేసి ఎమ్మెల్యేలుగా విజయం

# లాటరీ కింగ్‌కు తగిలిన పొలిటికల్ లాటరీ!

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్‌కు పొలిటికల్ లాటరీ తగిలింది. ఆయన కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మూడు వేర్వేరు ప్రధాన రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసి గెలిచారు. శాంటియాగో మార్టిన్ భార్య లీమారోస్ మార్టిన్ తమిళనాడులోని లాల్‌గుడి స్థానం నుంచి అన్నాడీఎంకే తరఫున పోటీ చేసి విజయఢంకా మోగించారు. ఇక శాంటియాగో మార్టిన్ కుమారుడు జోస్ ఛార్లెస్ మార్టిన్ పుదుచ్చేరిలోని కామరాజ్ నగర్ స్థానంలో సొంత పార్టీ లత్చీయ జననాయగ కచ్చి (ఎల్‌జేకే) తరఫున నెగ్గారు. మరోవైపు శాంటియాగో మార్టిన్ అల్లుడు ఆధవ్ అర్జున తమిళనాడులోని హీరో విజయ్‌కు చెందిన టీవీకే తరఫున విక్కి విక్కం స్థానంలో గెలుపొందారు. పార్టీ ఏదైనా సరే గెలుపు మాత్రం లాటరీ కింగ్ కుటుంబానికే లభించింది. గతంలో ఎన్నికల బాండ్ల ద్వారా ప్రధాన రాజకీయపార్టీలకు భారీ విరాళాలిచ్చిన శాంటియాగో మార్టిన్, ఇప్పుడు నేరుగా తన కుటుంబీకుల ద్వారా రాజకీయాల్లో చక్రం తిప్పేందుకు రెడీ అయ్యారు.

**జోస్ ఛార్లెస్ మార్టిన్ : సొంత పార్టీతో విజయఢంకా**

శాంటియాగో మార్టిన్ కుమారుడు జోస్ ఛార్లెస్ మార్టిన్ గురించే మనం తొలుత చెప్పుకోవాలి. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఈయన ఆస్తుల విలువ రూ.600 కోట్లకు పైమాటే. లాటరీ వ్యాపారం చేసే మార్టిన్ గ్రూపునకు మేనేజింగ్ డైరెక్టర్‌గా జోస్ ఛార్లెస్ వ్యవహరిస్తున్నారు. ఆయన 2015లో ఢిల్లీలో అప్పటి బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ సమక్షంలో అధికారికంగా పార్టీలో చేరారు. జోస్ ఛార్లెస్ మార్టిన్ బీజేపీలో సుమారు 9 సంవత్సరాల పాటు (2015 నుంచి 2024 వరకు) పనిచేశారు. పుదుచ్చేరిలోని బీజేపీ నాయకత్వంతో వచ్చిన విబేధాల కారణంగా 2024లో పార్టీకి దూరమయ్యారు. వాస్తవానికి ఈయన కుటుంబం తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందింది. అయితే తన రాజకీయాల కోసం పుదుచ్చేరిని జోస్ ఛార్లెస్ ఎంచుకున్నారు. ఈనేపథ్యంలో ఈసారి పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన 2025 డిసెంబరులోనే లత్చీయ జననాయగ కచ్చి (ఎల్‌జేకే) పార్టీని ఏర్పాటు చేశారు. ఆ వెంటనే బీజేపీ, ఏఐఎన్ఆర్సీ పార్టీలతో కూడిన ఎన్‌డీఏ కూటమిలో జోస్ ఛార్లెస్ చేరారు. దీంతో ఆయనకు కీలకమైన కామరాజ్ నగర్ అసెంబ్లీ సీటును కేటాయించారు. ఈయన



తన సమీప ప్రత్యర్థులైన కాంగ్రెస్ అభ్యర్థి పీకే దేవదాస్, టీవీకే అభ్యర్థి సుమన్‌లపై 10,000కుపైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

**రాజకీయాలను ప్రభావితం చేసే ఆలోచనే లేదు : జోస్ ఛార్లెస్ మార్టిన్**

"నేను తమిళనాడు నుంచి పుదుచ్చేరికి పూర్తిగా షిఫ్ట్ అయ్యాను. ఇక నన్ను బయటి వ్యక్తి అనడం సరికాదు. పుదుచ్చేరిని సింగపూర్, హాంకాంగ్‌లా డెవలప్ చేయాలని నేను అనుకుంటున్నాను. ఇక్కడి ప్రజల జీవితాలను మార్చాలని భావిస్తున్నాను. పుదుచ్చేరి ప్రజలు నా మాటలను విశ్వసిస్తున్నారు. అంతే తప్ప తమిళనాడు, పుదుచ్చేరిలలో రాజకీయాలను ప్రభావితం చేయాలనే ఆలోచన మా కుటుంబానికి లేనే లేదు. కేవలం నాకు సీటు కేటాయింపులో జాప్యం చేసినందుకే బీజేపీని వీడాను. నేను బీజేపీని వీడినా, ఇంకా ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజన్‌ను, మేకిన్ ఇండియా ప్రోగ్రాంను ఆరాధిస్తూనే ఉన్నాను" అని ఇటీవలె ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జోస్ ఛార్లెస్ మార్టిన్ వ్యాఖ్యానించారు.

**లాల్‌గుడిలో లీమారోస్ మార్టిన్ గెలుపు**

లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ భార్య లీమారోస్ మార్టిన్ తమిళనాడులోని తిరుచిరాపల్లి జిల్లా లాల్‌గుడి స్థానంలో అన్నా డీఎంకే తరఫున గెలిచారు. సమీప ప్రత్యర్థి టీవీకేకు చెందిన కృపా కృష్ణన్‌పై 2,739 ఓట్ల తేడాతో ఆమె నెగ్గారు. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం లీమారోస్ ఆస్తుల విలువ రూ.1,049 కోట్లు. లాల్‌గుడి స్థానంలో అన్నా డీఎంకే గెలవడం గత 2 దశాబ్దాల తర్వాత ఇదే తొలిసారి. గతంలో ఈ సీటు డీఎంకే కంచుకోటగా ఉండేది. 2006, 2011, 2016, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో లాల్‌గుడి సీటు డీఎంకేకే దక్కింది. ఈ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి టి పరివల్లల్ 5,230 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

**రెండు నెలల క్రితమే అన్నాడీఎంకేలోకి**

లీమారోస్ మార్టిన్ తొలుత ఇండియా జననాయక కచ్చి పార్టీలో 14 సంవత్సరాల పాటు (2012 నుంచి 2026 వరకు) పనిచేశారు. ఆ పార్టీలో ఆమె డిప్యూటీ జనరల్ సెక్రటరీగా, ఆ తర్వాత జాయింట్ జనరల్ సెక్రటరీగా కీలక బాధ్యతలను నిర్వర్తించారు. అయితే పార్టీ నాయకత్వం నుంచి సరైన గుర్తింపు లభించడం లేదని పేర్కొంటూ, 2026 ఫిబ్రవరి 10న ఆమె ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన కొద్ది రోజులకే 2026 ఫిబ్రవరి 17న అన్నా డీఎంకేలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆ పార్టీ మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు.

**లాటరీ కింగ్ అల్లుడి విజయం**

లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ అల్లుడు ఆధవ్ అర్జున కూడా తమిళనాడులో విజయఢంకా మోగించారు. ఆయన విక్కివక్కం స్థానంలో హీరో విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు. సమీప ప్రత్యర్థి డీఎంకేకు చెందిన కార్తీక్ మోహన్‌పై 17,302 ఓట్ల తేడాతో ఆధవ్ అర్జున విజయం సాధించారు. ఇక మూడో స్థానంలో నిలిచిన అన్నా డీఎంకే అభ్యర్థి విజయ కుమార్ కంటే 47,107 ఓట్లను ఎక్కువగా పొందారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో విక్కివక్కం స్థానంలో డీఎంకేనే గెలిచింది.

**టీవీకేలో నంబర్ 2 నేతగా గుర్తింపు**

శాంటియాగో మార్టిన్ కుమార్తె డైసీ మార్టిన్‌ను ఆధవ్ అర్జున పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం హీరో విజయ్‌కు చెందిన టీవీకే పార్టీలో ప్రధాన కార్యదర్శిగా (ఎన్నికల ప్రచార నిర్వహణ విభాగం) ఆయన వ్యవహరిస్తున్నారు. అంటే విజయ్ తరఫున ఎన్నికల ప్రచార వ్యవహారాలన్నీ ఆధవ్ అర్జున పర్యవేక్షించారు. టీవీకేలో నంబర్ 2గా ఈయనకు పేరు వచ్చింది. దీన్నిబట్టి పార్టీ నిర్ణయాలను ప్రభావితం చేయగలిగే కీలక నేతగా వ్యవహరిస్తున్నారని స్పష్టమవుతోంది. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఆధవ్ అర్జున ఆస్తుల విలువ రూ.534.90 కోట్లు.

## 7న విజయ్ ప్రమాణస్వీకారం?

తమిళనాడు అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని టీవీకే అధ్యక్షుడు విజయ్ తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలే తమ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలకు విజయ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజల శ్రేయస్సు, సంక్షేమమే తన ఏకైక లక్ష్యమని తెలిపారు. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి తమిళనాడు ప్రగతిపైనే దృష్టి సారిస్తామని ఆయన ఉద్ఘాటించారు. తమిళనాడు అభివృద్ధికి కేంద్ర సహకారం కావాలని విజయ్ కోరారు. మరోవైపు, రాహుల్ శుభాకాంక్షలపై స్పందించిన విజయ్, తమిళనాడు అస్తిత్వం, సంస్కృతి పరిరక్షణకు అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా, గురువారం తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చెన్నై నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే, బుధవారం గవర్నర్‌ను కలవనున్నట్లు టీవీకే అధ్యక్షుడు విజయ్ తెలిపారు.

## 'పాక్‌పై భారత్‌దే సంపూర్ణ ఆధిపత్యం



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్, పీఓకేలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలే టార్గెట్‌గా భారత్ చేసిన దాడులపై ఆస్ట్రియన్ వైమానిక యుద్ధ విశ్లేషకుడు, చరిత్రకారుడు టామ్ కూపర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాక్‌పై భారత్ దాడులను స్పష్టమైన సైనిక విజయంగా అభివర్ణించారు. పాకిస్థాన్‌తో జరిగిన ఘర్షణల్లో భారత్‌కు ఉన్న నిర్ణయాత్మక ఆధిక్యాన్ని ఈ సందర్భంగా హైలైట్ చేశారు. భారత్ సైనికపరంగా పాక్‌ను మించిపోవడమే కాకుండా తన ప్రణాళికాబద్ధమైన, కచ్చితమైన ప్రతిస్పందన ద్వారా ఒక బలమైన వ్యూహాత్మక సందేశాన్ని కూడా దాయాది దేశానికి ఇచ్చిందని చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో టామ్ కూపర్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "పాకిస్థాన్‌లోని ప్రధాన ఉగ్రవాద శిబిరాలపై భారత్ అత్యంత విజయవంతమైన ప్రతీకార దాడులు నిర్వహించింది. అంతేకాకుండా భారత్ చేరుకోలేదని భావించిన అసాధ్యమైన లక్ష్యాలను కూడా ఛేదించింది. దీంతో పాక్ తీవ్రంగా నష్టపోయింది. అందుకే పాకిస్థాన్ రక్షణాత్మక ధోరణిలోకి వెళ్లిపోయింది. భారతదేశ కార్యాచరణ సామర్థ్యం దాని వ్యూహాత్మక విధానంలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తుంది. పాకిస్థాన్‌లోని దేనిపైనైనా దాడి చేయగలమని, తమను ఆపలేరని పాక్‌కు భారత్ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. భారత్ చేపట్టిన దాడులకు ప్రతీకారం తీర్చుకోవాలని పాక్ ప్రయత్నించింది. భారత వైమానిక, సైనిక స్థావరాలు, పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఉద్రిక్తతను పెంచడానికి ప్రయత్నించింది. భారత వైమానిక రక్షణ వ్యవస్థలు అనుకున్న విధంగానే కచ్చితంగా పనిచేశాయి. పాక్ నుంచి దూసుకొస్తున్న రాకెట్లు, క్షిపణులు, యూఏవీలు వంటి 95-98 శాతానికి పైగా క్షిపణులను అవి అడ్డుకుని ధ్వంసం చేశాయి. పాక్ ప్రతీకార చర్యలు దాదాపు పూర్తిగా విఫలమయ్యాయి" అని టామ్ కూపర్ పేర్కొన్నారు.

## టీఎంసీ ఓటమిపై సంబరాలా?




బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఓటమిపై కాంగ్రెస్ పార్టీలోని కొందరు సభ్యులు మురిసిపోతుండడంపై, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోం, బంగాల్‌లలో బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు బీజేపీ వేసిన ఒక పెద్ద ముందడుగు అని పేర్కొన్నారు. ప్రజలు చిల్లర రాజకీయాలు పక్కన పెట్టి, దేశం కోసం బీజేపీకి వ్యతిరేకంగా కలిసి పోరాడాలని ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. "కాంగ్రెస్‌లోని కొందరు, ఇతరులు కొందరు బంగాల్‌లో టీఎంసీ ఓటమిని చూసి సంబరపడి పోతున్నారు. వారు ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అసోం, బంగాల్ ప్రజల తీర్పును దొంగిలించడం అనేది భారత ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో బీజేపీ వేసిన ఒక పెద్ద ముందడుగు. స్వల్ప రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టండి. ఇది ఒక పార్టీకి లేదా మరొక పార్టీకి సంబంధించిన విషయం కాదు. ఇది భారతదేశానికి సంబంధించిన విషయం."

**మమతతో ఏకీభవిస్తున్నా!**

బంగాల్‌లో బీజేపీ 100 కంటే ఎక్కువ సీట్లను లూటీ చేసిందని ఆ రాష్ట్ర మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషన్ బీజేపీ కమిషన్‌గా మారిపోయిందని ఆరోపించారు. బంగాల్‌లో బీజేపీ సాధించిన విజయాన్ని అనైతికతం, చట్టవిరుద్ధం అని పేర్కొన్నారు. మమతా బెనర్జీ చేసిన ఈ వ్యాఖ్యలతో రాహుల్ గాంధీ పూర్తిగా ఏకీభవించారు. "ఎన్నికల కమిషన్ మద్దతులో బీజేపీ అసోం, బంగాల్ ఎన్నికలను చోరీ చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మేము మమతా బెనర్జీతో ఏకీభవిస్తున్నాం. బంగాల్‌లో 100 కంటే ఎక్కువ సీట్లు చోరీ అయ్యాయి" అని రాహుల్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

**మమతా బెనర్జీ ఏమన్నారుంటే?**

"బీజేపీ 100 కంటే ఎక్కువ సీట్లను లూటీ చేసింది. ఎన్నికల కమిషన్ అనేదికి బీజేపీకి కొమ్ముకాసే కమిషన్‌గా మారింది. నేను సీఓకు, మనోజ్ అగర్వాల్?కు ఫిర్యాదు చేసినా వారు ఏమీ చేయడం లేదు. దీనిని మీరు విజయమని భావిస్తున్నారా? ఇది అనైతిక విజయం, ఇందులో నైతికత ఏమీ లేదు. కేంద్ర బలగాలు, ప్రధాని, కేంద్ర హోంమంత్రి అండతో ఎన్నికల కమిషన్ చేసినవన్నీ పూర్తిగా చట్టవిరుద్ధం. ఇది కేవలం లూటీ, లూటీ, లూటీ మాత్రమే. అయినా సరే మేము మళ్లీ పుంజుకుంటాం" అని మమతా బెనర్జీ అన్నారు. కాగా, 2025 బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 206 స్థానాలను కైవసం చేసుకొని చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 77 స్థానాల్లో గెలుపొందిన ఆ పార్టీ, ఈసారి ఏకంగా బంగాల్?లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించడం విశేషం. మరోవైపు గత ఎన్నికల్లో 212 స్థానాల్లో ఘనవిజయం సాధించిన టీఎంసీ, ఈసారి కేవలం 80 స్థానాలకే పరిమితమై రెండు స్థానానికి పడిపోయింది. కాంగ్రెస్ పార్టీ కేవలం 2 సీట్లకే పరిమితమైంది. గతమెంతో ఘనకీర్తి కలిగిన లెఫ్ట్ ఫ్రంట్ కూడా కేవలం 2 స్థానాలతో సరిపెట్టుకుంది. మరో ఇద్దరు స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. దీనితో బంగాల్?లో బీజేపీకి తిరుగులేని విజయం దక్కింది. ఈ గెలుపుపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. తమ పార్టీ వ్యవస్థాపకుడైన డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ కల ఇన్నేళ్లకు నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. బీజేపీ దృష్టిలో ఈ విజయం రాజకీయాలకు అతీతమైనదని, రాష్ట్రాన్ని సురక్షితంగా, సుభిక్షంగా ఉంచాలనే తమ వ్యవస్థాపకుడి ఆశయమని అన్నారు. అందుకే బంగాల్ ఉన్నతికి తమ పార్టీ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పదింతల ప్రోత్సాహం

-మొదటిపేజీ తరువాయి

అండగా ఉంటుందని వారు విద్యార్థులకు భరోసా ఇచ్చారు. కూటమికి చెందిన ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో 10వ తరగతి ఫలితాల్లో అసాధారణ ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని తన నివాసంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు విద్యార్థుల కోసం ఒక విందును ఏర్పాటు చేశారు. అయ్యన్న కుటుంబ సభ్యులు స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా స్పీకర్ విద్యార్థులకు ఏటికొప్పాక చెక్కతో రూపొందించిన సరస్వతీ అమ్మవారి విగ్రహాలను బహుమతులుగా అందజేశారు.

“అనకాపల్లికి సంబంధించిన 7 నియోజకవర్గాల్లో 570 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు నర్సీపట్నంలోనే 50కి పైగా ఉన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా మంచి పర్సంటేజ్? తెచ్చుకునే అవకాశాలు ఉన్నాయి. చాలా మందికి ఇవాళ్ల చదువుపై ఆసక్తి ఉంది. ఏదో సాధించాలనే తపన కూడా పిల్లల్లో ఉంది. తప్పని సరిగా వాళ్లు అనుకున్నది సాధిస్తారు. ఉన్నత స్థాయిలోకి వెళ్తారు” బి అయ్యన్న పాత్రుడు, స్పీకర్

విద్యార్థులకు రూ. 20,000 విలువ గల బహుమతులు

పల్నాడు జిల్లా వినుకొండలో ప్రభుత్వ విప్ జి.వి. ఆంజనేయులు విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో ఆ నియోజకవర్గ పరిధిలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ ర్యాంకు సాధించిన ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి రూ. 20,000 నగదు బహుమతిని అందజేశారు. అదేవిధంగా మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయన ఒక్కొక్కరికీ రూ.10,000 చొప్పున బహుమతులు అందజేశారు.

### విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసిన కలెక్టరు

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే సురేంద్ర బాబు



విద్యార్థులను ఘనంగా సన్మానించి వారికి బ్యాగులను బహుమతులుగా అందజేశారు. విజయవాడలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ మండలి ఛైర్మన్ బాలకోటయ్య సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విజయవాడలో ‘10వ తరగతి టాపర్లతో భోజనం’ పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. 580కి పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఆయన కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన విద్యార్థులను శాలువాలతో సన్మానించి వారికి జ్ఞాపికలను అందజేశారు.

### కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు సాధించడం అభినందనీయం : పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి

ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుకున్న బాలబాలికలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించడం అభినందనీయమని బాపట్లజిల్లా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మార్టూరు మండలం ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ఏలూరి సత్కరించారు. మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండలాల్లో ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జ్ఞాపికలతో సన్మానించారు. ప్రోత్సాహక బహుమతులు అందజేసి, శ్రమించిన ఆయా పాఠశాలల ఉపాధ్యాయులనూ సత్కరించారు.

# పేదలకు కూటమి ప్రభుత్వం తీపికబురు

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించేలా అధికారులు తగిన చర్యలను తీసుకుంటున్నారు. రాష్ట్రానికి అవసరమైన మిగిలిన ఇళ్లను కూడా కేంద్ర ప్రభుత్వం దశల వారీగా మంజూరు చేయనున్నట్లు తెలిసింది.

### గతంలో ఒక్క ఇల్లూ మంజూరు చేయలేదు

వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో పేదల కోసం గృహ నిర్మాణాన్ని కేవలం పట్టణ ప్రాంతాలు, పట్టణ అభివృద్ధి సంస్థల పరిధిలోనే చేపట్టింది. ఐదేళ్ల పరిపాలనలో గ్రామీణ ప్రాంతాల్లో పేదల కోసం కనీసం ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవాలనుకున్న వారికి అనుమతులు గానీ, ఆర్థిక సహాయం గానీ అందించలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణానికి భారీగా డిమాండ్ ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారుగా 10 లక్షల మంది ప్రజలు తమ సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ధృవీకరణ తనిఖీ నిర్వహించారు. ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత 6 లక్షల నుంచి 7 లక్షల మంది అర్హులు ఉన్నారు అని అధికారులు గుర్తించారు. అయితే ఇప్పుడు ఈ అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేయాల్సి ఉంది. వైఎస్సార్సీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం దాదాపు 16 లక్షల ఇళ్లను మంజూరు చేసినప్పటికీ, అవి సకాలంలో పూర్తి కాలేదు. ఫలితంగా గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పురోగతికి అనుగుణంగానే కొత్త గృహాలను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

### లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదు


పీఎంఏవై గ్రామీణ 2.0 పథకం కింద ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల్లో తమ వాటాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



విడుదల చేస్తాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా కింద ఉపాధి హామీ పథకం ద్వారా రూ.72,000, మరుగుదొడ్ల నిర్మాణ పథకం కింద రూ.39,000 అందుతున్నాయి. అయితే మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ నిధులు స్పర్శ్ విధానంలో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. మార్చి 31కి ముందు వరకు కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను రాష్ట్ర సింగిల్ నోడల్ ఖాతాకు బదిలీ చేస్తుండేది. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను 21 రోజుల్లోనే గృహ నిర్మాణ సంస్థకు విడుదల చేసేది. అయితే కొత్త విధానం ప్రకారం లబ్ధిదారుల గృహ నిర్మాణానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధుల్ని విడుదల చేసిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం ఆ మేరకు నిధులను విడుదల చేస్తుంది. తర్వాత ఆర్?బీఐ నుంచి నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదు జమవుతుంది.

# కలెక్టర్ వైఖరితో రెవెన్యూ శాఖలో వణుకు

**తిరుపతి :** ఆ జిల్లా కలెక్టర్ అందరికీ ఓకే రాజకీయ నాయకులు సహా అన్ని వర్గాలు ఇబ్బంది లేదంటున్నాయిగానీ ఒక గవర్నమెంట్ డిపార్ట్‌మెంటే వద్దనుకుంటోందట. సాధారణంగా? ఎమ్మెల్యేలకు, కలెక్టర్లకు వివిధ అంశాలకు సంబంధించిన అభిప్రాయ భేదాలు వస్తుంటాయి. పరిష్కారం ఫైళ్లలో కాదు, ఫీల్డ్‌లో ఉండాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్టు జిల్లాలో చెప్పుకుంటున్నారు. అదే సమయంలో ఏళ్ళ తరబడి అవినీతి అరచేతి మందాన పేరుకుపోయి, నిర్లక్ష్యం నిలువెత్తునా పేరుకుపోయిన ప్రభుత్వ విభాగాల తుప్పు వదిలించే పని కూడా మొదలుపెట్టారట వెంకటేశ్వర్. ఆయన చర్యలతో ముఖ్యంగా రెవెన్యూ శాఖలో ఎప్పుడూ లేని విధంగా ఒక రకమైన వణుకు మొదలైందని చెప్పుకుంటున్నారు.కలెక్టర్ ఎప్పుడు, ఏ రూపంలో ఏ ఆఫీసుపై రైడ్ చేస్తారో తెలియక రెవెన్యూ అధికారులు వణుకుతున్నట్టు తెలుస్తోంది. అందుకు ఇటీవల పుల్లంపేట మండలంలో జరిగిన ఘటననే ఉదాహరణగా చెబుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఒక మాజీ సైనికుడి భూ సమస్య పరిష్కారం విషయంలో జరిగిన జాప్యాన్ని తీవ్రంగా పరిగణించారట కలెక్టర్. ఆ మాజీ సైనికుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో? వెంటనే స్పందించిన కలెక్టర్.. తన ఎదురుగానే బాధితుడితో తహసీల్దారుకు ఫోన్ చేయించారు. అట్నుంచి అత్యంత నిర్లక్ష్యంగా సమాధానం రావడంతో డైరెక్ట్‌గా కాల్‌లోకి వచ్చిన కలెక్టర్ బాధితుడికి న్యాయం చేయకపోగా కబ్జా చేసినవారికి మద్దతు తెలుపుతావా స్పాట్‌లోనే తహశీల్దార్, కలెక్టర్‌ని సస్పెండ్ చేశారు. ఈ ఘటన జిల్లా రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపింది. అలాగే వాకాడు తహసీల్దార్‌పై వచ్చిన వేధింపుల ఆరోపణల విషయంలోనూ కఠినంగా వ్యవహరించి, తక్షణమే చర్యలు తీసుకున్నారు. ఇలా.. తిరుపతి జిల్లాలో ఇప్పటిదాకా కొద్దిమంది సస్పెండ్ కాగా చాలామంది అధికారులు బదిలీ అయ్యారు.మరోవైపు కేవలం ఆర్డర్లు వేయడమే కాకుండా



బైక్‌ల మీద పర్యటిస్తూ, గ్రౌండ్ లెవల్‌లో ఏం జరుగుతోందో కూడా కలెక్టర్ తెలుసుకోవడం రెవెన్యూ సిబ్బందికి మింగుడు పడటం లేదట. ఇక పొలిటికల్ సర్కిల్స్‌లోనూ వెంకటేశ్వర్ గురించి ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. సాధారణంగా ఎమ్మెల్యేలకు, కలెక్టర్లకు మధ్య ఏదో ఒక విషయంలో గ్యాప్ ఉంటుంది. ఇదే జిల్లాలో గతంలో అలాంటివి జరిగాయి కూడా. కానీ? ఇప్పుడు సీన్ రివర్స్‌లో ఉందట. పలువురు ఎమ్మెల్యేలే స్వయంగా ఈమధ్య జరిగిన ఓ సమావేశంలో మాకు ఈ కలెక్టరే కావాలని సీఎంని కోరినట్టు తెలిసింది. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతుండటంతో పాటు ఎమ్మెల్యేల పనులు కూడా ఎక్కడా పెండింగ్ ఉండటం లేదని చెప్పుకుంటున్నారు. అయితే రాజకీయ సిఫార్సులకంటే రూల్స్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఒకరిద్దరికి లోలోపల అసంతృప్తిగా ఉన్నా? ఓవరాల్‌గా చూసుకున్నప్పుడు ఓకే అనుకుంటూ బయటికి ఏమీ అనలేకపోతున్నారట. ఇక లా అండ్ ఆర్డర్ విషయంలోనూ ఎస్పీ సుబ్బారాయుడుతో కలిసి పని చేస్తున్న వ్యవహారం చర్చనీయాంశం అయింది.రోడ్డు ప్రమాదాల నివారణ కోసం 14 గంటల బస్సు యాత్రలు చేపట్టడం, గంజాయి కట్టడికి చర్యలు, 20కోట్ల విలువైన గంజాయి కాల్చివేత లాంటి వ్యవహారాల్లో కలెక్టర్, ఎస్పీ సమన్వయంతో పని చేస్తున్నారు. ఇక టీటీడీ బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి లాంటి భారీ కార్యక్రమాల్లోనూ ప్రోటోకాల్‌కే పరిమితం కాకుండా అన్నిటిలో జోక్యం చేసుకుంటున్నారు. టీటీడీలోనూ లా అండ్ ఆర్డర్ విషయంలో కలెక్టర్ చొరవ చూపిస్తున్నారు. మొత్తం మీద అందరూ తిరుపతి కలెక్టర్ ఓకే అంటుంటే సొంత రెవెన్యూ డిపార్ట్‌మెంట్ మాత్రం మాకొద్దు బాబోయ్ ఈ ఆఫీసర్ అంటూ గగ్గోలు పెట్టడం ఆసక్తికరంగా మారింది. సార్.. కాస్త వేగం తగ్గించాలి.. ఆకస్మిక తనిఖీలు ఆపాలంటూ కలెక్టరేట్ గోడల మధ్య గుసగుసలు వినిపిస్తున్నాయటా. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మార్కులు పడ్డా, ఎమ్మెల్యేల మద్దతు ఉన్నా.. రెవెన్యూ వర్గాల్లో అసహనం ఆయనపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ప్రస్తుతానికి సస్పెన్స్.

## విశాఖ కేంద్రంగా కొత్త రైల్వేజోన్

-మొదటిపేజీ తరువాయి

నెరవేరిందన్నారు. ఏపీ విజ్ఞప్తిని మన్నించి చరిత్రాత్మక గెజిట్ విడుదలకు సహకరించిన ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి జోన్ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం అవుతాయన్నారు.

### ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి దోహదం

వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రాన్ని మారుస్తుందని అభిప్రాయపడ్డారు. నూతనంగా ఏర్పాటైన విశాఖ డివిజన్, రాయగడ డివిజన్‌ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రత్యేకించి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వృద్ధికి ఈ జోన్ దోహదపడుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

### విశాఖ డివిజన్‌లో విలీనం

గుంతకల్లు డివిజన్ నుంచి “రాయచూర్ - వాడి సెక్షన్” సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అయింది. రాయగడ నుంచి కొన్ని సెక్షన్లను విశాఖ డివిజన్?లో కలుపుతూ ఉత్తర్వులు విడుదల చేసింది. తాజా ఉత్తర్వులతో రాయగడ డివిజన్‌లో ఇంతకు ముందున్న పలాస-ఇచ్ఛాపురం రైల్వే లైన్, ఇచ్ఛాపురం-దువ్వాడ-విజయనగరం లైన్?ను విశాఖ డివిజన్‌లో చేరాయి. అదే విధంగా నౌపడ -పర్లాకిమిడి, బొబ్బిలి-సాలూరు లైన్?లు సింహాచలం-వడ్లపూడి, విశాఖ-జగ్గయ్యపాలెం రైల్వేలైన్లను విశాఖ డివిజన్?లో విలీనం చేశారు. కోరాపుట్-కిరండోల్ లైన్?ను విశాఖ, రాయగడ డివిజన్లకు సంయుక్తంగా కేటాయించింది. ఈ మార్పులన్నీ జూన్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో రైల్వే బోర్డు స్పష్టం చేసింది.

ఇవే గీటురాళ్లు: ఉత్తరాంధ్ర అభివృద్ధికి విశాఖ రైల్వే జోన్ గ్రోత్ ఇంజిన్‌లా మారుతుందని నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైళ్ల సంఖ్య పెరిగి కనెక్టివిటీ మెరుగుపడుతుందని చెప్పారు. ఇచ్ఛాపురం, పలాస సెక్షన్‌ను విశాఖ డివిజన్‌కు బదిలీ చెయ్యడంలో ప్రభుత్వం చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు. ఇటీవల అమరావతికి చట్టబద్ధత, నేడు విశాఖ రైల్వే జోన్‌కు గెజిట్? వచ్చిందని టీడీపీ నేత ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వేగవంతమైన పాలనకు ఇవే గీటురాళ్లని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ హబ్ చేయాలన్న సీఎం ఆలోచనకు తొలి అడుగు పడిందన్నారు. వచ్చే నెల 1 నుంచి విశాఖ రైల్వే జోన్ అమల్లోకి వస్తుందన్న ప్రత్తిపాటి ఈ జోన్‌తో పారిశ్రామిక అభివృద్ధికి మార్గం సుగమమవుతుందన్నారు. కొత్త రైల్వే జోన్ పరిధిలో 74 స్టేషన్ల ఆధునికీకరణ, 1,039 కి.మీ. మేర కొత్త లైన్ ఏర్పాటు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధాన పోర్టులు, పారిశ్రామిక హబ్‌లు కలుపుతూ రైల్వే లైన్ వస్తుందని ప్రత్తిపాటి వివరించారు. రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదలపై ఉత్తరాంధ్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాజధానిలో ఈ నెలాఖరుకు ల్యాండ్‌పూలింగ్ పూర్తి

-మొదటిపేజీ తరువాయి

మంత్రి తెలిపారు. ఎన్ఎస్పీ ప్రభావిత బాధితుల ఇళ్ల సమస్య, ఎఫ్ఎస్ఐ అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడామన్నారు. రాజధాని ప్రాంతంలో గ్రామీణ రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ‘రాజధాని రైతుల సమస్యలపై సీఆర్డీఏలో త్రిసభ్య కమిటీ కొన్ని కారణాల వల్ల ఆలస్యమయ్యింది. ఇకపై అలా జరగకుండా చూసుకుంటాం. 29 గ్రామాల్లో కమిషనర్ పర్యటించి గ్రామసభలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించాం. ఆర్ ఫై జోన్ రద్దు చేశాం. ల్యాండ్ పూలింగ్ 40 శాతం పూర్తయింది, ఈ నెలాఖరుకు 60 శాతం పూర్తి చేస్తాం.’ క్షేత్రస్థాయి పర్యటనలకు ఆదేశం: కమిషనర్లు, జాయింట్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సమావేశంలో నిర్ణయించామని మంత్రి నారాయణ తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో 2-3 వారాల్లో రెగ్యులర్ సమావేశాలు నిర్వహిస్తామని, అంశాల వారీగా సమీక్ష చేసి పరిష్కారాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించామని వివరించారు. గ్రామ కంఠాల సమస్యలు, రోడ్ల విస్తరణలో భూములు కోల్పోయే నిర్వాసితుల ఇబ్బందులపై చర్చించామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆదేశాలు ఇచ్చామని, 29 గ్రామాల్లో కమిషనర్ స్వయంగా పర్యటించాలని సూచించామని తెలిపారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కూడా ఆదేశించినట్లు చెప్పారు. ఆర్ ఫై జోన్ రద్దు- ల్యాండ్ పూలింగ్ వేగవంతం: ఆర్ ఫై జోన్‌ను వెనక్కి తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం మూడు గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ 40 శాతం పూర్తయిందని, కౌలు పెంపుతో రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ నెల చివరి నాటికి ల్యాండ్ పూలింగ్ 60 శాతం వరకు పూర్తవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

## తిరుమలకు పోటెత్తుతున్న భక్తులు



వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలకు భక్తులు పోటెత్తుతున్నారు. సాధారణంగా రద్దీ పెరిగితే దర్శనానికి రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. అదేవిధంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా, రద్దీ సమయాల్లోనూ సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ యంత్రాంగం అమలు చేస్తున్న ప్రణాళికలు సత్ఫలితాలనిస్తున్నాయి. వైకుంఠం కంపార్ట్‌మెంట్లలో గంటల తరబడి పడిగాపులు కాసే అవస్థలు తప్పించి, 8 గంటల్లోనే స్వామివారి దర్శనం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే నేరుగా అనుమతి ఇస్తున్నారు. దీంతో రోజుకు సుమారు 2 గంటల సమయం ఆదా అవుతోంది. ఈ సమయాన్ని సర్వదర్శనం భక్తులకు కేటాయిస్తున్నారు. దీంతో క్యూలైన్లు కూడా వేగంగా కదులుతున్నాయి. సాధారణ రోజుల్లో 70,000 మందికి దర్శనం కల్పించేవారు. అయితే, ప్రస్తుత ఏర్పాట్ల వల్ల ఆ సంఖ్య 90 వేల నుంచి లక్షకు చేరువ అవుతుండడం విశేషం. సాంకేతికతతో పకడ్బందీ పర్యవేక్షణ: అధునాతన సాంకేతికతను వాడుకోవడంలో టీటీడీ మరో అడుగు ముందుకు వేసింది. ఏఐ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ సీసీ కెమెరాల ద్వారా క్యూ కాంప్లెక్స్‌లు, మాడవీధులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

సర్వదర్శనానికి వచ్చే భక్తుల నిరీక్షణ సమయం 8 గంటలు దాటకుండా (రెడ్ మార్క్) టీటీడీ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. ఒక స్లాట్ దర్శనం కోసం మరో స్లాట్?ను ఆపకుండా నిరంతరాయంగా భక్తులను అనుమతిస్తున్నారు. స్లాటెడ్ సర్వదర్శనం 2 నుంచి 3 గంటల్లోపు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం రెండున్నర గంటల్లోపు పూర్తి అవుతోందని భక్తులు చెబుతున్నారు. శ్రీవారిని దర్శించుకునేందుకు శనివారం లక్ష మందికి పైగా భక్తులు రాగా, దర్శన సమయం 13 గంటలకు మించకుండా టీటీడీ అధికారులు అదుపు చేయగలిగారు.

సాధారణ రోజుల్లో సగటున 70,000 మందికి స్వామివారి దర్శనం కల్పిస్తున్నారు. అయితే తాజా చర్యలతో ఆ సంఖ్య 90 వేల నుంచి లక్షకు చేరువ అవుతోందని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. అభిషేకం కారణంగా శుక్రవారం రోజుల్లో సాధారణంగా 65,000 మందికి మాత్రమే దర్శనం జరిగేదని, ఇప్పుడు ఆ సంఖ్య 71,000 దాటుతోందని అధికారులు వెల్లడించారు. గత 3 రోజుల్లో 2,45,686 మంది స్వామివారిని దర్శించుకున్నారు. మొత్తం రూ.11.95 కోట్ల ఆదాయం సమకూరింది. మే 2న అత్యధికంగా 91,005 మందికి దర్శన భాగ్యం లభించింది. అదేవిధంగా మే 3న అత్యధికంగా రూ.5.06 కోట్ల హుండీ ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. ఆ దర్శనాలు, సేవలు యథాతథం: సామాన్య భక్తులకు దర్శన సమయాన్ని పెంచుతున్నారు. అదే విధంగా ముందుగా నిర్ణయించిన కోటా విషయంలోనూ టీటీడీ యథాతథ స్థితిని కొనసాగిస్తుండటం గమనార్హం. శ్రీవాణి ట్రస్టు టికెట్లు, రూ.300 దర్శనం, ఎన్?ఆర్?ఐ కోటా, ఆర్జిత సేవలతో పాటు వృద్ధులు, దివ్యాంగుల దర్శనాలు ఎప్పటిలాగే నిర్దేశిత సమయాల్లో కొనసాగుతున్నాయి.

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# ఆస్మానియంత్రణకు చక్కని చికిత్స మందులు





## డాక్టర్ సి.ప్రేమ్ దీప్, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు.

నెల్లూరు స్వర్ణ సాగరం మే5

ఆస్తమా నియంత్రణకు మంచి మందులుచక్కని చికిత్స ఉన్నాయని, ఆస్తమా వ్యాధికి భయపడాల్సిన పనిలేదని ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ సి. ప్రేమ్ దీప్ అన్నారు. మంగళవారం, స్థానిక సంజయ్ గాంధీనగర్ లోని శ్రీ లక్ష్మీసాయి ప్రథమ చికిత్సలయం నందు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా), బిలీవ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆస్తమా నివారణ దినోత్సవం సందర్భంగా ఆస్తమాపై అవగాహన సదస్సు మరియు ఉచిత వైద్య శిబిరం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ సి.ప్రేమ్ దీప్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఆస్తమా వ్యాధికి భయపడాల్సిన పనిలేదని, దీని నియంత్రణకు మంచి చికిత్సలు ఉన్నాయని అన్నారు. ప్రతి సంవత్సరం మే నెల మొదటి మంగళవారం ప్రపంచ ఆస్తమా నివారణ దినోత్సవం జరుపుకుంటారని, ఆస్తమా (ఉబ్బసం) గురించి, ఆస్తమాతో బాధపడుతున్న వ్యక్తుల గురించి అవగాహన కల్పించడానికి గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ ఆస్తమా (+×చీూ) ద్వారా నిర్వహించబడుతుందని. నేడు జీవనశైలి మరియు పర్యావరణ మార్పుల కారణంగా ఆస్తమా ప్రాబల్యం గణనీయంగా పెరుగుతుందన్నారు.ఆస్తమా అనేది ఒక దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధి, ఇది దీర్ఘకాలంగా మనిషికి ఊపిరి అందకుండా చేస్తుంది. ఇది పిల్లలలోను, పెద్దలలోనూ కూడా కనిపిస్తుందని, అయితే ఇద్దరిలోనూ కారణాలు వేరువేరుగా ఉంటాయని, ఈ వ్యాధి ప్రధాన లక్షణం ఆయాసం అని అన్నారు. ఆస్తమా వలన శ్వాసనాళాలు సంకోచించి వాపు వస్తుందని, దీని వల్ల శ్లేష్మం ఎక్కువగా తయారై ఊపిరిని అడ్డుకుంటాయన్నారు. చల్లని గాలి, వాతావరణంలో ఎలర్జీని కలిగించే పదార్థాలు, పొగాకు(స్మోకింగ్), మానసిక ఆందోళన, పెంపుడు జంతువుల ధూళి వంటివి కారణాలు చెప్పవచ్చు. ఈ విధమైన కారణాల వలన శ్వాసనాళాలు సంకోచం చెంది ఆయాసం, ఛాతీ పట్టినట్లుగా ఉండటం, దగ్గు, పిల్లి కూతలు వస్తాయి. ఈ శ్వాసకోశ నాళాలు వ్యాకోచం కలిగించడానికి బ్రాంకోడైలేటర్స్ మందులు మంచి ఉపశమనాన్ని కలిగిస్తాయని. అయితే తగ్గినట్లుగా తగ్గి మరలా తిరిగి వచ్చేయడం ఆస్తమా ప్రధాన లక్షణమన్నారు. దీని వలన ఆస్తమా రోగులు ఎక్కువ కాలం మందులు వాడటం వలన వారు మందులకు అలవాటు పడిపోయే ప్రమాదం ఉందని. కొంతమందికి ఈ వ్యాధి ప్రాణాంతకం కూడా కావచ్చును. పిల్లలలో జలుబు వంటి వైరస్ ఈ వ్యాధికి ప్రధాన కారణమన్నారు.ఆస్తమా లక్షణాలను నియంత్రించడంలో మరియు ప్రాణాంతకమైన ఆస్తమా దాడులను నివారించడంలో యాంటీ ఇనఫ్లమేటరీ ఇన్హేలర్ల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించుటకు ఈ ఏడాది "ఆస్తమా ఉన్న ప్రతి ఒక్కరికీ యాంటీఇనఫ్లమేటరీ ఇన్హేలర్ల అందుబాటు – ఇప్పటికీ అత్యవసరమైన అవసరం" అనే థీమ్ ద్వారా ఆస్తమా సంరక్షణను మెరుగుపర్చడం మరియు సరైన చికిత్స గురించి అవగాహన కల్పించడం, ఆస్తమా రోగులందరికీ అవసరమైన ఇన్హేలర్లు సులభంగా అతితక్కువ ఖర్చుతో అందుబాటులో ఉంచడంపై దృష్టి కేంద్రీకరించబడింది. మనమంతా ఆస్తమా పై అవగాహన కల్పించి వారి ఆరోగ్య సంరక్షణలో పాలుపంచుకుందాం అని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరము నందు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆస్తమా నివారణ మందులను అందజేశారు. అనంతరం జిల్లా పీ.హెచ్.పీ నాయకులు డాక్టర్ ప్రేమ్ దీప్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీ.హెచ్.పీ జిల్లా గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్ బాషా, యోగా మాస్టర్ పెంచలయ్య, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పి.హెచ్.పి జిల్లా నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, కె. రామ రాఘవయ్య, బి. శంకర్రావు, ఎస్. రాము, ఏ. రమేష్, షేక్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

# జెసిబి తో కొట్టు

## ఉపాధి హామీలో నగదు పట్టు- ఉపాధి లేక అల్లాడుతున్న ప్రజలు

వి.కోట స్వర్ణ సాగరం మే 05:-

చిత్తూరు జిల్లా వి కోట మండలంలో ఉపాధి హామీ పథకం నందు జెసిబి యంత్రాలతో పనులు చేపట్టి లక్షలాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. కుంబార్లపల్లి పంచాయతీ పరిధిలో జడ్పీ హైస్కూలు వద్ద గల కాటమరాజు వంకను మంగళవారం జెసిబి యంత్రంతో పనులను పూర్తి చేసిన సుమారు ఐదు నుండి ఆరు లక్షల రూపాయలు పనులు జరిగినట్లు రికార్డులు సృష్టించేందుకు రెడీ అయ్యారు. గతంలో సైతం ఇదే వంకను శుభ్రపరిచి గంగమ్మ ఏరులో వంకనీరు పారే విధంగా నిధులను స్వాహా చేశారు. వారి కంటే మేము ఏమి తీసుకోమంటూ ప్రస్తుతం ఉన్న ఉపాధి హామీ సిబ్బంది కాటమరాజు వంకను శుభ్రపరిచి వర్షపు నీరు సజావుగా గంగమ్మ ఏరులోకలిసే విధంగా పనులు చేపట్టారు. ఇక మాస్టర్లు ను కూలీల పేర్లతో పెట్టడమే తరువాయి. ఇదేమిటని ఏపీవో గౌరీ శంకర్ను వివరణ కోరితే ఆ పనికి ప్రభుత్వ అనుమతి లేదని, అసలు ఆ పని జరుగుతున్నట్లు తనకు తెలియదని, నిధులను మంజూరు ఆపివేస్తానని నింపాదిగా తెలిపారు. కృష్ణా జలాలతో నిండిపోయిన చెరువుల్లో చేపల కుంటలు తవ్విన అధికారులకు జెసిబి యంత్రాలతో పనులు పూర్తి చేసిన వాటికి అనుమతులు తెచ్చుకోవడం కష్టమంటారా? ఎవరి ప్రమేయం లేకుండా ఇలా పనులు చేపట్టడం సాధ్యమేనా? సస్పెన్షన్లకు గురైనప్పటికీ అధికార యంత్రాంగం తమ బుద్ధిని ఇకనైనా మారుతుంది అని అనుకోవడం అత్యాశ అవుతుందేమో. జిల్లా అధికార యంత్రాంగం వీరికి ఏమి ఆదేశాలు ఇస్తుందో ఇప్పుడున్న అధికారులకే ఎరుక?అని అంటున్న ప్రజలు



# వెంకన్నపాళెంలో వరుస చోరీలు - హడలెత్తుతున్న రైతులు

కోట స్వర్ణసాగరం మే 5





కోట మండలం వెంకన్నపాలెం గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు, పొలాల్లోని విద్యుత్ మోటార్ల వైర్లు మరియు సామగ్రిని దోచుకెళ్లారు.ఈ దొంగతనంపై భాధిత రైతులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.బాధిత రైతుల పేర్కొన్న వివరాల మేరకు రైతులు మంగళవారం ఉదయం 8 గంటలకు మోటర్లు వేయడానికి పొలాల్లోకి వెళ్లి చూడగా మోటార్ల యొక్క వైర్లు కత్తిరించి తస్కరించినట్లు గుర్తించారు. నాలుగు మోటార్ల యొక్క వైర్లు విలువ దాదాపు 30 వేల రూపాయలు ఉంటుందని వారు పేర్కొన్నారు.ఎడగారు నాట్లు సిద్ధమవుతున్న వేళ వైర్ల చోరీ పెనుబారంగా మారిందని వాపోయారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నాట్లకు సిద్ధమవుతున్న సమయంలో మోటారు వస్తువులు వైర్లు చోరీ తో తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. మోటార్ల వైలెను 100 అడుగుల వరకు పీకేసి తీసుకెళ్లడంతో మోటార్లను పైకి తీసి,మరలా కొత్త వైర్ వేయవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు.తద్వారా ఒక్కో మోటార్కు 15000 రూపాయలు ఖర్చవుతుందన్నారు.వెంకన్న పాలెంలో పది రోజుల క్రితం ప్రముఖ భారతీయ జనతా పార్టీ నేత తో పాటు,సన్న చిన్న కారు నిరుపేద రైతుల యొక్క వైర్లు స్టార్టర్లు చోరీ జరిగిందన్నారు . ప్రజలకు పట్టెడు అన్నం పెట్టే రైతుల వ్యవసాయ ఉపకరణాలను దోచుకోవడం సరికాదన్నారు.ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు ఇలాంటి దొంగతనాలు కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు.రైతులకు గిట్టుబాటు ధర లేకపోయినా , లాభాలు లేకపోయినా,ప్రకృతి సహకరించక పోయిన భూమిని నమ్ముకొని పంటలు పండిస్తున్నారన్నారు.ముఖ్యంగా ప్రతి సంవత్సరం మూడు నుండి నాలుగు సార్లు ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని, ఏడాదికి పలు మోటార్లకు సంబంధించిన వైర్లు,సామాగ్రి మాయమవుతున్నాయన్నారు. పోలీసు యంత్రాంగం స్పందించి, గ్రామాల్లో రాత్రి వేళల్లో నిఘా పెంచాలని మరియు రైతులకు అండగా ఉండాలన్నారు. స్థానికంగా వ్యాపారం చేస్తున్న స్క్రాప్ వెండర్స్ పై పోలీస్ శాఖ నిఘా పెట్టాలని బాధితులు కోరారు.

# ఆమందూరులో కిశోర వికాసం కార్యక్రమం




స్వర్ణ సాగరం ఏర్పేడు:

మండల పరిధిలోని ఆమందూరు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 'కిశోర వికాసం' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ రేణిగుంట ప్రాజెక్ట్ పరిధిలో సీడీపీఓ కృష్ణవేణి ఆదేశాల మేరకు కిశోర బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

మే 1వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం రోజుల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య ప్రాముఖ్యత, వ్యక్తిగత ఆరోగ్యం, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు.అలాగే సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ల వినియోగంపై వివరించారు. పోక్సో చట్టం, గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించి బాలికలు ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె. రత్నమ్మ, మహిళా పోలీస్ రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు సుమతి, ఎ. సునీతతో పాటు కిశోర బాలికలు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్ విషయం పై నోరు మేదిపిన ఇరిగేషన్ డి. ఇ..

కొయ్యలగూడెం స్వర్ణ సాగరం



కొయ్యలగూడెం మండలంలో ఏవైతే మట్టి తొలకాల కు సంబంధించి పర్మిషన్స్ ఇచ్చారో అవి నిబంధనలు మించి జరప డంలో విఫలం అయ్యితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డి. ఇ హెచ్చరించారు,పర్మిషన్స్ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతి ఇవ్వబడింది అని,ఒకరి పర్మిషన్స్ లో ఎంత మేరకు నిర్దేశించిన దానిని బట్టి,ఆ యొక్క నిబంధనలు దాటితే వారి యొక్క అనుమతులు రద్దు చేస్తామని స్పష్టం చేయడం జరిగింది,మట్టి అనేది పొలం యొక్క అవసరాల కోసమే తప్ప దానిని ఇటుక బట్టీ లకు, కమర్షియల్ సైట్ లకు తొలడం వంటివి జరిగితే, తమ దృష్టికి వస్తె వారి పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది,కొయ్యలగూడెం మండలం లో జరిగే తవ్వకాల విషయమై నేడు డి ఇ ఈ విధంగా స్పందించడం జరిగింది.

# "జీవన నైపుణ్యాలపై స్వీయ అవగాహన అవసరం



సమ్మర్ క్యాలెండర్సందర్భంగాఐసిడిఎస్ సూపర్వైజర్ లలితాంబ

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే 5

కిషోర్ వికాసం కింద జీవన నైపుణ్యాలపై స్వీయ అవగాహన ఎంతో అవసరమని ఇందుకూరుపేట ఐసిడిఎస్ సూపర్వైజర్ లలితాంబ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఐ సి డి ఎస్ పేడూరు సెక్టార్ పరిధిలోని కామాక్షి నగర్ అంగన్వాడీ కేంద్రంలో సమ్మర్ క్యాలెండర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ జీవన నైపుణ్యాలు దీనిపై అవగాహన తో పాటు జీవితంలో ఏది మంచో ఏది చెడు అన్న దానిపై తారతమ్యాలను ఉదాహరణలతో వివరించారు. హెల్ప్ లైన్ గురించి వాటి అవసరాలను తెలిపారు అంగన్వాడి కార్యకర్తలు కిషోర వికాసం పై ప్రత్యేక దృష్టి పెట్టి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సక్కుబాయమ్మ విమలమ్మ తల్లిదండ్రులు పాల్గొన్నారు

# వి ఆర్ సి టవర్ క్లాక్ వద్ద శాశ్వత బస్టాండ్ ఏర్పాటు చేయాలి

## మున్సిపల్ కమిషనర్ కు జనసేన పార్టీ విజ్ఞప్తి



నెల్లూరు స్వర్ణసాగరం మే5

నెల్లూరు వి ఆర్ సి క్లాక్ టవర్ సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం శాశ్వత బస్టాండును ఏర్పాటు చేయాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు మున్సిపల్ కమిషనర్ నందన్ నుకలిసి విజ్ఞాపన పత్రం అందించారు. గతంలో తమ విజ్ఞప్తి అనుసరించి తాటాకులతో తాత్కాలిక బస్టాండ్ ను ఏర్పాటు చేయడం పట్ల కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు కానీ ఈ ప్రాంతం వద్ద శాశ్వత బస్టాండ్ ఏర్పాటు చేసి ప్రయాణికుల అవసరాలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ను కలిసిన వారిలో ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం బోలా అశోక్ కావలి మస్తాన్ చిన్న వెంకటాచలం మండల కార్యదర్శి సందూరి శ్రీహరి పొట్లూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా సంకటహార చతుర్థి

కాణిపాకం స్వర్ణ సాగరం మే 5



వైభవంగా సంకటహార చతుర్థి .కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం ఆస్థాన మండపం నందు మంగళవారం సంకటహార చతుర్థి సందర్భంగా వైభవంగా శ్రీ స్వామి వారి సంకటహార గణపతి వ్రతం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం డీఈఓ సాగర్ బాబు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు బాలాజీ నాయుడు, రవి, అర్చకులు, వేదపండితులు, తదితరులు పాల్గొన్నారు.

## ముత్తుకూరు పీహెచ్‌సీపై ఆకస్మిక తనిఖీ



ముత్తుకూరు.. స్వర్ణ సాగరం

జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్ వలి మంగళవారం ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ దేవి కృపతో కలిసి ఆశా డే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.అనంతరం ఆరోగ్య సిబ్బంది, ఎం.ఎల్.హెచ్. పిలు, ఆశాలు నిర్వహిస్తున్న రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్య ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న జాతీయ కార్యక్రమాలు, '100 రోజుల టీబి ముక్త్ భారత్ అభియాన్'తో పాటు ఇటీవల చేపట్టిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.టీబి వ్యాధిగ్రస్తులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వెంటనే చికిత్సకు అవసరమైన మందులు అందిస్తే వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా సిబ్బంది అంకితభావంతో పనిచేస్తే టీబి ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, డాక్టర్ మస్తాన్ బాబు, సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, హెచ్ఈఓ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ పుట్టినరోజు, పెళ్లిరోజున సేవా కార్యక్రమాలు



స్వర్ణసాగరం డోర్నకల్ మే 05

డోర్నకల్ మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ , పుట్టినరోజు మరియు పెళ్లిరోజు సందర్భంగా మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ కొండేటి రాజకుమారి హరినాథ్, వైస్ చైర్ పర్సన్ మాదా లావణ్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని గాంధీ కూడలి, ఎన్టీఆర్ సర్కిల్, బ్యాంక్ స్ట్రీట్, రైల్వే స్టేషన్,రోడ్ లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేసి చేశారు. ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కాల సుమేర్ జైన్, వార్డు కౌన్సిలర్లు ప్రమీల రమేష్, వీరన్న, రామకోటేష్, హేమలత,గారే రమేష్,సంధ్య వెంకటేష్, మాజీ చైర్మన్ వీరన్న, కమిషనర్ నిరంజన్,డాక్టర్ సద్విజ, కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి హనుమాన్ ఏపూరి రమణయ్య,హరి కృష్ణ, మామిడి నాగరాజు, రామకృష్ణ, ఎస్ వెంకటేశ్వర్లు,బద్రు నాయక్, ధరవాత్ కృష్ణ, ఏపూరి కృష్ణ,తదితరులు ఉన్నారు

## వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ డిఎంహెచ్ ఓ ఖాదర్ వలీ



తోటపల్లి గూడూరుస్వర్ణ సాగరం మే5

మండలం వరిగొండ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు జిల్లా వైద్య అధికారి ఎస్.కె ఖాదర్ వలీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా డే సందర్భంగా పి హెచ్ సి ని సందర్శించడం జరిగిందన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను ఉద్దేశించి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన దంపతులకు ఈసీ ట్రాకింగ్, ×ఫీూ మరియు విటమిన్ ూ మందుల పంపిణీ వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ ఎన్ రాధిక, డాక్టర్ అశోక్, సూపర్వైజర్లు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్.



తిరుపతి/ఏలూరు, స్వర్ణ సాగరం

మంగళవారం తిరుమల వచ్చిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలోహా శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఎంపీని పట్టు వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# మొలక పోలేరమ్మ జాతర ఘనంగా ప్రారంభం









### భక్తులతో కిటకిటలాడిన గ్రామ వీధులు

### -- తొలి రోజు పూజలు వైభవంగా

ముత్తుకూరు..స్వర్ణ సాగరం

మండల పరిధిలోని గ్రామంలో వెలసిన మొలక పోలేరమ్మ తల్లి జాతర ఉత్సవాలు తొలి రోజు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర సందర్భంగా తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో పుట్ట బంగారం తెచ్చి అమ్మవారి ప్రతిమను తయారు చేసి శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రతి వీధిలో మహిళలు సంప్రదాయ పద్ధతిలో పొంగళ్ళు ప్రారంభించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జాతర నేపథ్యంలో గ్రామమంతా పండుగ వాతావరణం అలుముకుంది. భక్తుల రాకపోకలతో వీధులు కిటకిటలాడగా, ఎటు చూసినా భక్తి నినాదాలు మారుమోగాయి. స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు భారీగా పాల్గొని జాతరను విజయవంతం చేశారు. మరుసటి రోజులలో కూడా వివిధ పూజా కార్యక్రమాలు, ప్రత్యేక సేవలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# డి.వడ్డిపల్లి లో అక్రమ మద్యం విక్రయాలు పై స్పందించిన ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ

స్వర్ణ సగరం డక్కిలి (మే 5)

తిరుపతి జిల్లా డక్కిలి మండలం డి వడ్డిపల్లి గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలపై వెలువడిన కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించింది. గ్రామంలో బెల్ట్ షాపుల పెరుగుదలపై మహిళల ఆవేదన, నిరసనలను ప్రాముఖ్యంగా వెలుగులోకి తీసుకురావడంతో ఎక్సైజ్ శాఖ వెంటనే స్పందించింది. దీని ఫలితంగా గ్రామంలో కొనసాగుతున్న అక్రమ మద్యం దుకాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.తక్షణ చర్యగా ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులతో కలిసి డి వడ్డిపల్లిలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పలు బెల్ట్ షాపులను గుర్తించి మూసివేయడంతో పాటు, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. గ్రామంలో ఆటోల ద్వారా జరుగుతున్న మద్యం సరఫరాపై కూడా నిఘా పెంచినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ గ్రామాన్ని సందర్శించి మహిళలతో మాట్లాడారు. గ్రామంలో ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ బెల్ట్ షాపులు నిర్వహించనివ్వమని స్పష్టం చేశారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డి వడ్డిపల్లిలో బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలిస్తామని మహిళలకు భరోసా ఇచ్చారు.జేపీ న్యూస్ కథనం తర్వాత అధికారులు తీసుకున్న ఈ చర్యలతో గ్రామంలో కొంత ఉపశమనం నెలకొంది. మహిళలు కూడా అధికారుల స్పందనపై సానుకూలంగా స్పందిస్తూ, ఇదే విధంగా క్రమం తప్పకుండా తనిఖీలు కొనసాగించాలని కోరుతున్నారు.




అక్రమ మద్యం దందాపై నిరంతర చర్యలు కొనసాగితేనే గ్రామంలో శాంతి భద్రతలు పునరుద్ధరించబడతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన స్టేట్ విజలెన్స్ అధికారి డాక్టర్ బి సి ఏ నాయక్





బంగారుపాలెం.స్వర్ణసాగరం. మే 5

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర విజిలెన్స్ అధికారి డాక్టర్ బి సి ఏ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఆసుపత్రిలోని డయాలసిస్ యూనిట్ ని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులను అక్కడ సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు వసుతి కేంద్రం,గైనిక్, పైడియట్రిక్, ఎన్టీఆర్ సేవలు, ఎయిడ్స్ నియంత్రణ,క్యాజువాలటి, ల్యాబ్ తదితర ప్రదేశాలను సందరర్శించి అనంతరం పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్త పరిచారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారిని డాక్టర్ శిరీష, డాక్టర్ స్వరూప్ నాయక్, డాక్టర్ చంద్రకళ, హెడ్ నర్స్ సుమతి బాయి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## భూ అమృత్ పేరిట మోసాలకు అడ్డుకట్ట,

### దుర్గాప్రసాద్‌పై రైతుల తీవ్ర ఆరోపణలు,

### హెర్బల్ ఉత్పత్తులపై అనుమానాలు వెల్లువ..స్పష్టత ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు,



స్వర్ణసాగరం- తొట్టంబేడు,

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం చిలకవారికండ్రిగ గ్రామంలోని భూ అమృత్ కేంద్రం వద్ద మంగళవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో రైతులు దుర్గాప్రసాద్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తిరుపతి పార్లమెంట్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు టి. ప్రకాష్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మే 1న "గ్రామ బజార్" యూట్యూబ్ ఛానల్ ద్వారా దుర్గాప్రసాద్ చేసిన ప్రకటనలు అనుమానాస్పదంగా ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. గతంలో కారాకొల్లు గ్రామానికి చెందిన గల్లా చంద్రశేఖర్ అనే శాస్త్రవేత్త ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను పంపిణీ చేశామని చెప్పడం, ప్రస్తుతం కూడా హెర్బల్ నిల్వ ఉందని పేర్కొనడం విశ్వసనీయంగా లేదని విమర్శించారు.శాస్త్రవేత్తలపై కోర్టు కేసులు వేసిన వ్యక్తి ఇప్పుడు అదే ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావడం ఎలా సాధ్యమవుతుందో వివరించాలని రైతులు ప్రశ్నించారు. ఈ ఉత్పత్తులను తయారు చేసిన శాస్త్రవేత్త ఎవరు? వాటి పేటెంట్ హక్కులు ఎవరివి? అనే విషయాలపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత దుర్గాప్రసాద్‌పై ఉందన్నారు.అలాకాకపోతే నకిలీ మందుల పేరుతో రైతులను మోసం చేయడం, వారి ప్రాణాలతో చెలగాటం ఆడడం సహించబోమని హెచ్చరించారు. ఇలాంటి ఉత్పత్తులను సరఫరా చేయడానికి ప్రయత్నిస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అంజూరు రఘురామయ్య, పి. వెంకటేశ్వర్లు, కే. హరి నాయుడు, కందేరి రాజా నాయుడు, మద్దినేని మురళి నాయుడు, బెజవాడ హరిబాబు, డి. ఢిల్లీ, గాలి లోకేష్ తదితర రైతులు పాల్గొన్నారు.

# ప్రతిభకు పట్టం కట్టిన కోటేశ్వరబాబు,

### టెన్త్‌లో టాప్ చేసిన సాయి పూజితకు నగదు బహుమతి

### ముక్కంటి శేషవస్త్రంతో సత్కారం,

స్వర్ణసాగరం- శ్రీకాళహస్తి,

పతిభను గుర్తించి ప్రోత్సహించడంలో ముందుండే సంఘసేవకుడు యల్లంపాటి కోటేశ్వరబాబు మరోసారి ఆదర్శంగా నిలిచారు. పదవ తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సాయి పూజితను స్వయంగా అభినందించి ప్రోత్సాహక బహుమతి అందజేశారు.బాబు అగ్రహారం ఉన్నత పాఠశాలకు చెందిన సాయి పూజిత టెన్త్ పరీక్షల్లో 594 మార్కులు సాధించి రాణించింది. ఈ ఫలితాలతో శ్రీకాళహస్తి పట్టణంలో మొదటి స్థానం, చిత్తూరు జిల్లాలో రెండో స్థానం సాధించి అందరి ప్రశంసలు పొందింది. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఆమె కృషి స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.మంగళవారం విద్యార్థిని ఇంటికి వెళ్లిన కోటేశ్వరబాబు, శ్రీకాళహస్తి ముక్కంటి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి, పైచదువులకు ప్రోత్సాహంగా రూ.5,000 నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తలచుకుంటే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చు. అలాంటి ప్రతిభను సమాజం ప్రోత్సహించాలి" అన్నారు.విద్య, సామాజిక సేవా రంగాల్లో కోటేశ్వరబాబు నిరంతరం సేవలందిస్తూ గుర్తింపు పొందుతున్నారు.



గతంలో కూడా కాపుగున్నేరి పాఠశాల విద్యార్థికి ఇదే తరహాలో ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

RNI No : APTEL/2020/1908
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# గ్రంధాలయాన్ని ఆకస్మిక తనిఖీ





**స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ**

మండల కేంద్రంలోని గ్రంధాలయమును ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ శ్రీ రెడ్డివారి గురువారెడ్డి మంగళవారం తనిఖీచేపెట్టారు.ఈ సందర్భంగా గ్రంధాలయ చైర్మన్ మాట్లాడుతూ గౌరవ శ్రీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు మరి యు గౌరవ ఐటీ శాఖ మాత్యులు శ్రీ నారా లోకేష్ కూటమి ప్రభుత్వంలో గ్రంధాలయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పాఠ కులను ఆకర్షించి విద్యార్థుల్ని ప్రోత్సహించి పుస్తక పఠనం వైపు మగ్గుచూపే విధంగా ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తుంది అన్నారు ..కూటమీ ప్రభుత్వంఉగాది రోజున విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ లో 100 గ్రంథాలయ అధికారుల ఉద్యోగాలను విడుదల చేయడం జరిగిందని. ఈ సందర్భంగా నటసార్వభౌముడు శ్రీ నందమూరి తారకరామారావు 1986వ సంవత్సరంలో మండల విద్యాన కేంద్రాలు ప్రతి మండలానికి స్థాపించి మన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 36 ఉద్యోగాలను కల్పిం చడం జరిగిందని .అదేవిధంగా ఆయన మనవడుఅయినటువంటి విద్యాశాఖ మాత్యులు శ్రీ నారా లోకేష్ వారి ఆశయాలను ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆలోచన ముందుకా తీసుకుపోతు న్నారన్నారు .ఈ తనిఖీలో భాగంగా పుస్తకాలు తనిఖీ చేస్తూ గ్రంథాలయ అధికారి ద్వారా శాఖా గ్రంథాలయంలో 7000 పైచిలకు పుస్తకాలు పాఠకులకు కోసం ఉంచామని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలను బుచ్చినాయుడు కండ్రికలో కూడా ప్రారంభిస్తాం అని తెలిపారు ..గ్రంథాలయానికి విచ్చేసిన చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డిని బి.యన్. కండ్రిగ మండలం మాజీ అధ్యక్షులు సీనియర్ నాయకులు ఏం సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు అనంతరం మాజీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రివర్యులు నారా లోకేష్ విద్యామంత్రిగా ఉండి గ్రంథాలయాలకి ప్రథమ ప్రాధాన్ని తీస్తూ అభివృద్ధి చేసే విధంగా సంకల్పంతో పని చేస్తున్నారని అన్నారు.. అనంతరం అందుబాటులో ఉన్న నాయకులు పాఠకులతో చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి ప్రత్యేకంగా సమావేశమై పలు విషయాలు గ్రంథాల అభివృద్ధికి సంబంధించిన విషయాలను వారి ద్వారా తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో గ్రంధాల అధికారి శ్రీ సిరాజుద్దీన్ బిలాల్ కి గ్రంథాలయ అభివృద్ధికి పలు రకాల సూచనలు ఇచ్చారు ..ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ,పార్టీ నాయకులు మధు నాయుడు, రవి నాయుడు ,వీరరాఘవులు, బాబు, సుధాకర్, పలువురు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఘనంగా బడి పిలుస్తుంది కార్యక్రమం







**స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ**

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె వి ఎన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 30వ తేదీన విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాస్ అవ్వడంతో పాటు మంచి మార్కులు సాధించడం అనేది ఎంత గర్వకారణం అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు విద్యార్థులకు ఎంతో లాభదాయకమని, ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యతో పాటు క్రమశిక్షణ కలిగిన విధంగా విద్యను బోధిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం కల్లివెట్టు ప్రాథమిక పాఠశాలలో సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి 2026 -27 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పత్రాలతో విద్యార్థులు హాజర య్యారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు మంచి విద్యను అందిస్తున్నట్లు వారు తెలిపారు ఈ. అవకాశా న్ని ప్రతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయు లందరూ పాల్గొన్నారు.

# కనిగిరిలో మెగా జాబ్ మేళా
## -- నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి




**కనిగిరి స్వర్ణ సాగరం మే 5:**

కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్స్‌లో ఈ నెల 8వ తేదీ ఉదయం 9:30 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గారి ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడుతోం ది.నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ జాబ్ మేళా నిర్వహి ంచబడుతున్నది. ఈ మేళాలో ౧౦౮ ౧౦౯, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ మరియు బీటెక్ అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి.ఈ జాబ్ మేళా ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించే అవకాశం ఉందని, నిరుద్యోగ సమస్యను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆయన సూచించారు.కనిగిరి మరియు పరిసర ప్రాంతాల అర్హత కలిగిన నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో హాజరై ఈ జాబ్ మేళాను విజయవంతం చేయాలని కోరారు.

# కిశోరి బాలికలకు జీవన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం



**కనిగిరి స్వర్ణ సాగరం మే 05**

కిశోరి వికాసం సమ్మర్ సెషన్--2 స్వీయ అవగాహన కార్యక్రమంలో భాగంగా సి.డి.పి.ఓ సరోజిని నేతృత్వంలో మంగళవారం కనిగిరి మండలం పరిధిలోని చాకిరాల గ్రామం ఎస్ సి కాలని నందు అంగన్వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో కిశోరి బాలికలకు జీవన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్ఐఆర్డీ సర్టిఫైడ్ మాస్టర్ రిసోర్స్ పర్సన్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు పాల్గొని బాలికలకు వ్యక్తిత్వ వికాసం,ఆత్మవిశ్వాసం, నిర్ణయ సామర్థ్యం వంటి జీవన నైపుణ్యాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో "నేను ప్రత్యేకమైన దాన్ని" అనే అంశంపై బాలికలు చార్టులపై తమ భావాలను వ్యక్తపరచి ప్రదర్శించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని గ్రామస్థులు అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా బాలికల్లో స్వీయ అవగాహన పెంపొందించడమే కాకుండా,తమ లక్ష్యాల సాధనలో ముందుకు సాగేందుకు ప్రేరణ కలిగిందని అంగన్వాడీ టీచర్స్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆంగన్వాడీ టీచర్స్ మందా జ్యోతి కుమారి, దీపికా, ఎస్ కె జారిన బాలికలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల 'ప్రగతి' బాట:
## ప్రత్యేక శిక్షణతోనే సాధ్యమైన అద్భుత ఫలితాలు
### - ఎంఈఓ పి.నరేష్ కుమార్




**మనుబోలు, స్వర్ణ సాగరం :**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తే అత్యధిక మార్కులు సాధిస్తారని ఈ ఏడాది విద్యార్థులు నిరూపించారని ఎంఈఓ నరేష్ కుమార్ అన్నారు. మనుబోలు ఎంఈఓ కార్యాలయంలో మండల స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థినిలను ఆయన ఘనంగా సన్మానించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు తీసుకువచ్చిన కొత్త విద్యా విధానం వల్ల విద్యా బోధనలో పలు మార్పులు వచ్చాయన్నారు. దీనితో ఏడాది ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారన్నారు. గత ఏడాది 83% మాత్రమే పాసవుగా 87% ఉత్తీర్ణతను సాధించారన్నారు. మడమనూరు హై స్కూల్ కి చెందిన సుశాంత్ 554 మార్కులను సాధించి మొదటి స్థానంలోనూ వీరంపల్లి హై స్కూల్ కి చెందిన శ్రావ్య 552 మార్కులతో రెండవ స్థానంలోనూ మనుబోలు హై స్కూల్ కి చెందిన లాస్య 547 మార్కులు తో మూడో స్థానంలో నిలిచారు. వారిని ఘనంగా సన్మానించారు.వారిని స్ఫూర్తిగా తీసుకొని వచ్చే ఏడాది కూడా మంచి మార్కులు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ అమూల్య కుమారి తదితరులు ఉన్నారు.

# దద్దాలకు నేలపాటి వారి వివాహ ఆహ్వానం

**కనిగిరి స్వర్ణ సాగరం మే 05**



కనిగిరి మండలం పేరంగుడిపల్లి లో నేలపాటి విజయ కుమార్ – నిర్మల గార్ల కుమార్తె సమేరి వివాహ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ని మర్యాద పూర్వకంగా కలి సి వివాహ ఆహ్వాన పత్రిక అందజే సిన డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి,ఇండ్ల మాలకొండ రాయుడు, నేలపాటి చిట్టిబాబు, యక్కంటి రామిరెడ్డి, వీరంరెడ్డి లక్ష్మిరెడ్డి, కత్తి సుకుమార్, నేలపాటి మేరి బాబు, చిన్ను బోయిన గంగయ్య, గూడూరు ఇర్మియా, నేలపాటి యస్వంత్ ,గూడూరి యస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ పి టిఎఫ్ అధ్యక్షుడిగా గుర్రప్ప..

**కార్వేటి నగరం:శ్రీ రంగరాజపురం స్వర్ణ సాగరం:మే 5:**







ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడుగా గుర్రప్ప, గౌరవ అధ్యక్షుడిగా ఏ మునిశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ధనంజయలు, కార్యదర్శులుగా జగదీష్ మేనక మెరీనా తులసి ఎస్ఆర్ బాబు తిరుమలేశం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ప్రకటించారు. మంగళవారం మండలం లోని వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణంలో ఏపీటీఎఫ్ జిల్లా ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల కాలంగా సేవలు అందించిన బాబు కదిరివేలు ఎనలేనివి అని కొనియాడారు. ఇకపై వారి సేవలను నూతనంగా నియమితులయ్యే వారు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎపి టి ఎఫ్ రాష్ట్ర అదనపు కార్యదర్శి చంగల్రాయ్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేయాలని,అలాగే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కిరణ్ ఏ పి టి ఎఫ్ సీనియర్ నాయకులు గోవర్ధన్ శెట్టి,చలపతిరా వు,దొరబాబు, శ్రీనివాసులు, పురుషోత్తం ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ అమ్మవారి సన్నిధిలో దాతృత్వం



## లక్షా 40 వేల రూపాయల బాణసంచా విరాళం అందజేసిన టీడీపీ నేత ఎస్.జె. రాజేష్ మరియు యాదవ సంక్షేమ సంఘం

**స్వర్ణ సాగరం (నాయుడుపేట) మే 4.**

నాయుడుపేట గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవాలు అంబ రాన్నంటుతున్నాయి. ఈ ఉత్సవాల సందడిలో భాగంగా తెలుగుదేశం పార్టీ నాయ కులు ఎస్.జె. రాజేష్ మరియు యాదవ సంక్షేమ సంఘం మరియు ప్రముఖులు తన ఉదా రత ను చాటుకున్నారు. అమ్మవారి జాతరలో బాణసంచా వేడుకల కోసం సుమారు రూ. 1,40, 000 (లక్షానలభైవేలరూపాయలు) విలువైన టపాసులను వారు విరాళంగా అందజేశారు.

**మాజీ ఎంపీ సమక్షంలో విరాళం అందజేత**

మంగళవారం సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సమక్షంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. అమ్మవారిపై భక్తితో ఇంతటి భారీ విరాళాన్ని అందజేసిన ఎస్.జె. రాజేష్ ని మాజీ ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అమ్మవారి జాతర వైభవం ఈ బాణసంచా వేడుకలతో మరింత రెట్టింపు కానుందని పోలేరమ్మ కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పోలేరమ్మ దేవస్థాన కమిటీ సభ్యులు మరియు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. వినుకొండ ధనంజయ, దాసరి నిరంజన్, జరామయ్య సాయి కిషోర్, కృష్ణారెడ్డి మరియు పలువురు నాయకులు, పాల్గొన్నారు..

# పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి - దద్దాల



**కనిగిరి స్వర్ణ సాగరం మే 04**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే పరమావధిగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ సూచించారు.మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారిని సీయస్ పురం మండలం జెడ్పిటిసి మేకల శ్రీనివాసులు యాదవ్ , బైరెడ్డి తిరుపతిరెడ్డి, మేడిబోయిన అటేలయ్య, యనమల సుబ్బారెడ్డి, మోడీ రమణయ్య మర్యాద పూర్వకంగా కలిసి బోయమడుగుల గ్రామ కమిటీలకు సంబంధించిన నియామకాల పత్రాలను ఆయనకు అందజేశారు.

# శ్రీ పోలేరమ్మ జాతరలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి.



**స్వర్ణ సాగరం (నాయుడుపేట) మే 4.**

ఈనెల 6వ తేదీన జరగనున్న నాయుడుపేట గ్రామదేవత శ్రీ పోలేరమ్మ జాతరలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ నాయుడుపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి వరప్రసాద్ రెడ్డి సిబ్బందికి సూచించారు.మంగళవారం సాయంత్రం నాయుడుపేట విద్యుత్ శాఖ కార్యాలయం లో జరిగిన ఆయన మాట్లాడారు. జాతరలో విద్యుత్ సరఫరా కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు,అపస్మృతులు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట విద్యుత్ శాఖ ఏఈ లు ఎన్ శివశంకర్,హరికృష్ణ,అనిల్ కుమార్,పలువురు లైన్ ఇన్స్పెక్టర్లు,లైన్మెన్లు,సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను నిర్మూలిద్దాం..

- అంగన్వాడీ పర్యవేక్షకులు



శ్రీ రంగరాజపురం: స్వర్ణసాగరం : మే 5 :

కిషోర్ వికాస్ కార్యక్రమాలతో ఆత్మస్థైర్యం పెంపొందించుకోవడానికి అలాగే అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా మెలగడానికి అవకాశం ఏర్పడుతుందని ఆ శాఖ సూపర్వైజర్లు రోజా రమణి, శకుంతలల ఆధ్వర్యంలో వారి వారి పరిధిలో అవగాహన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ క్రమంలో అంగన్వాడి కేంద్రంలో పోషకాహారం లోపం నివారించడానికి, పోషకాహారం గురించి, బాల్యవివాహాలు నిర్మూలన, మాదకద్రవ్యాల నిషేధం , సెల్ ఫోన్ల వాడకం తగ్గించడం గురించి ముఖ్యంగా బాలురుతో పాటు బాలికలకు విద్య చాలా అవసరం వంటి అవగాహన కల్పించే అంశాలను మీట్టింగ్ ద్వారా తల్లిదండ్రులకు, కిశోర బాలికలకు, తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ కే హైమావతి , తల్లిదండ్రులు, కిషోరి బాలికలు మరియు బాలురు,అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# గంధం అలంకరణతో నాయుడుపేట పోలేరమ్మ తల్లి.



స్వర్ణ సాగరం (నాయుడుపేట) మే 4.

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని వెలసి ఉన్న శ్రీ శ్రీ గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవం ప్రారంభమైంది.ఈ సందర్భంగా పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానా బాల సుబ్బారావు,ఎండోమెంట్ ఈవో నవీన్ కుమార్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈనెల మే 3వ తేదీ నుండి 6వ తేదీ వరకు జరిగే పోలేరమ్మ జాతర ఉత్సవాల్లో మంగళవారం తెల్లవారుజామున గడియారం వద్ద గంథం, అలంకరణతో శ్రీ శ్రీ గ్రామదేవత పోలేరమ్మ పట్టణ ప్రజలకు దర్శన భాగ్యం కల్పించారు.అనంతరం పట్టణంలో అన్న అమ్మవారి భక్తులు పోలేరమ్మ ఆలయం వద్దకి చేరుకొని, మొక్కుబడి నేర్చుకునే వాళ్ళు అంబళ్ళు పోయడం, టెంకాయలు కొట్టుకోవడం లాంటివి మొక్కుబడులుగా తీర్చుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ కమిటీ మెంబర్స్ నిత్యా కృష్ణారెడ్డి,వినుకొండ ధనంజయ, హైమావతి,నల్లభోతుల రామారావు,సురేష్ స్వామి, ఆలయ సభ్యులు యుగంధర్, బాలాజీ,తదితరులు ఉన్నారు.

# సీఎం రిలీఫ్ చెక్కులును పంపిణి చేసిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి



కనిగిరి స్వర్ణ సాగరం మే 05

సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి అన్నారు.వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న 52 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి రూ.38,80,009.రూపాయల చెక్కులను మంగళవారం కనిగిరి అమరావతి గ్రౌండ్స్ లో అందజేశారు.ప్రభుత్వం చేసిన మేలును గుర్తుంచుకోవాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు.

# శ్రీ పోలేరమ్మ తల్లి ఆశీస్సులు పేట నియోజకవర్గంపై ఉండాలి.. ఎమ్మెల్యే..!





## గ్రామదేవత శ్రీ పోలేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు పార్థసారథి.

## మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

## పోలేరమ్మకు అత్యంత భక్తి శ్రద్ధలతో సారె సమర్పణ.

స్వర్ణ సాగరం (నాయుడుపేట) మే 05.

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని నడిబొడ్డున కలిసి ఉన్న గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవ వేడుకలో మంగళవారం రాత్రి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.వారికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని వేలలాది భక్తులు దర్శించుకున్నారు.నాయుడుపేట పట్టణంలో వెలసి ఉన్న గ్రామదేవత శ్రీ పోలేరమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలతో శోభయమానంగా తీర్చిదిద్దారు. జాతర సందర్భంగా సాంప్రదాయ బద్దంగా పడమటి వీధిలోని కుమ్మరిమిట్ట వద్ద అమ్మవారి విగ్రహాన్ని తయారు చేసి అత్తగారి ఇళ్లైన శెట్టిపల్లి వారి వీధిలో అలంకరించి బేరిపేట వద్ద నుంచి ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన తీసుకువచ్చిన ప్రత్యేక వాహనంలో అమ్మణ్ణిని పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి గడియారం సెంటర్ వద్ద చలువ పందిళ్లతో ఏర్పాటు చేసిన సప్పరంలో ప్రతిష్టించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పోలేరమ్మ పట్టణ పురవీధుల్లో ఊరేగుతున్న సమయంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి, పొంగళ్లు పెట్టి కుంభాలు పోసి, వెయి కళ్ల కుండలతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మణ్ణి ఊరేగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే, తీన్‌మార్ బ్యాండ్లతో పాటు, వివిధ అమ్మవారి రూపాల ప్రత్యేక నృత్యాలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. దీంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొనింది.ఈ కార్యక్రమంలో ఈవో నవీన్ కుమార్, పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నాన్న బాల సుబ్బారావు,టిడిపి పట్టణ అధ్యక్షులు 786 రఫీ,టిడిపి నాయకులు పసలు గంగా ప్రసాద్, మాజీ జెడ్పిటిసి శ్రీరామ్ ప్రసాద్,కట్టా వెంకట రమణారెడ్డి, దారా అంకయ్య, అంకయ్య,ఎస్.జె జ్యూవలరీ పోట్లపూడి రాజేష్, పలుకూరు ముత్యాలయ్య,కాపులూరు చక్రపాణి,జువ్వలపాటి మస్తాన్,నా గిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పెల్లకూరు గోపాలకృష్ణ,పోలేరమ్మ ఆలయ కమిటీ మెంబర్లు నిత్య కృష్ణారెడ్డి,వినుకొండ ధనంజయ,హైమావతి,సురేష్ స్వామి,ఇమ్మడిశెట్టి వెం కటేశ్వర్లు, వాకిరి వెంకటేశ్వర్లు, నాయుడుపేట అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు,ఎస్సై శివ శంకర్ రావ్,పోలీసు సిబ్బంది ఉన్నారు పాల్గొన్నారు.

# తమిళనాట టీవీకే విజయంతో... నియోజకవర్గంలో సంబరాలు నిర్వహించిన...- వైఎస్ఆర్సిపి సమన్వయకర్త కృపా లక్ష్మి





శ్రీ రంగరాజపురం: స్వర్ణ సాగరం: మే 5 :

తమిళనాడు ఎన్నికల నేపథ్యంలో సోమవారం మొట్టమొదటిసారిగా దళితుడైన విజయ్ ప్రధాన పార్టీలకు అతీతంగా విజయం సాధించడంతో.. వైఎస్ఆర్సిపి నేత, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి కన్వీనర్ కృపా లక్ష్మి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని ఎస్ఆర్ పురం ప్రాంతంలో కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. సందర్భంగా కృపా లక్ష్మి మాట్లాడుతూ విజయ్ పేద వర్గానికి చెందిన వ్యక్తిగా తనదైన ముద్ర వేసి ప్రజల్లో దూసుకుపోయారని కొనియాడారు.తమిళనాడులో విజయ్ దళపతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి మిగతాది అంతా సేమ్ టు సేమ్

**విజయ్ జగన్ మంచి స్నేహితులు**

తమిళనాడు ప్రజలకు కాబోయే ముఖ్యమంత్రి విజయ్ దళపతి సుపరిపాలన అందిస్తారని నమ్మకం ఉంది. (మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి )శ్రీరంగరాజపురం మండలం కేంద్రంలోని తమిళనాడు రాష్ట్రం టీవీకే పార్టీ అఖండ మెజారిటీతో గెలుపొందడంతో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త కృపా లక్ష్మి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా బాణా సంచులు కాల్చుతూ, కేక్ కట్ చేసిపార్టీ సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ పెట్టి రెండేళ్లలోనే సీఎం పీఠం అధిరోహించడం మామూలు విషయం కాదు ఆంధ్రప్రదేశ్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి, తమిళనాడులో విజయ్ దళపతి ఆలోచనలు, ఆశయం, లక్ష్యం ఒక్కటే..! ప్రజలకు సంక్షేమ సుపరిపాలన అందించడమే వారి లక్ష్యంగా పనిచేస్తున్నారు. అందుకే వీరిద్దరూ ఒకే కోవాకు చెందిన వ్యక్తులు..

**కొంతమంది వ్యక్తులు పార్టీ పెట్టిన...** ఇతర పార్టీలపై ఆధారపడి ఉన్నారు. నమ్ముకున్న కార్యకర్తలను, అభిమానులను, ఇతర పార్టీ లకు సేవ చేస్తున్నారు.

వైఎస్ఆర్సిపి పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, టి వి కే పార్టీ అధినేత విజయ్ దళపతి వారినీ నమ్ముకున్న వారి కోసం ఎంత దూరమైనా పోరాటం చేయగల సమర్థులు.

# అఖండ భారత్ బీజేపీతోనే సాధ్యం

## ఏ ఎంసీ డైరెక్టర్ బోలా శీను

మనుబోలు, స్వర్ణ సాగరం:

ఆత్మీయమిత్రులారా.. " త్వరలోనే అఖండ భారత్ ఆవిర్భావం జరగబోతోన్న అద్భుత సంకేతాలు ఇవే "

మోదీ,అమిత్ షా..ప్రస్తుత భారత రాజకీయాల్లో అత్యంత కీలకమైన నాయకులు అని ఏ ఎంసీ డైరెక్టర్ బోలా శ్రీను మంగళవారం తెలియజేశారు. కాగితాల పూర్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూఅప్పుడప్పుడు వారి సొంత మద్దతుదారులు కూడా వారిని విమర్శిస్తుంటారు.వారి నిర్ణయాలను ప్రశ్నిసుంటారు. ఒక్కోసారి వారిని తక్కువ చేసి కూడా మాట్లాడుతుంటారు.అయినప్పటికీ, వీరిద్దరూ అత్యంత బలమైన రాజకీయ యోధులు. వారు రోజుకు 24 గంటలు, సంవత్సరంలో 365 రోజులు నిరంతరం పనిచేసే రాజకీయ యంత్రాలు. వారు అలిసిపోరు, ఆగిపోరు... గెలుపుకు పొంగిపోరు, ఓటమికి కుంగిపోరు... నిరంతరం శ్రమిస్తూనే ఉంటారు. గత 12–14 ఏళ్లలో వీరు సాధించనిది ఏముంది? ఒకప్పుడు అసాధ్యం అనుకున్న పనులను సైతం వారు సుసాధ్యం చేశారు. శతాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎన్నో పనులను విజయవంతంగా పూర్తి చేశారు.ముఖ్యంగా రాజకీయాల విషయానికొస్తే, బీజేపీని కేవలం దేశంలోనే కాకుండా





ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా మార్చింది వీరిద్దరే. జమ్మూ కాశ్మీర్‌లో బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి రాలేదని ఒకప్పుడు ప్రజలు అనుకునేవారు. కానీ బీజేపీ సాధించి చూపించింది. ఈశాన్య రాష్ట్రాల్లో అధికారం సంపాదించడం అసా ధ్యం అన్నారు. కానీ ఆ ప్రాంతంలోని ప్రతి రాష్ట్రంలోనూ అధికారాన్ని కైవసం చేసుకుని బీజేపీ తన సత్తా చాటింది. ఢిల్లీలో కేజ్రీవాల్‌ను ఓడించడం అసాధ్యం అన్నారు. కానీ బీజేపీ వారి అంచనాలను తలకిందులు చేసింది. ఒడిశాలో పట్నాయక్ ని ఓడించడం అసాధ్యం అన్నారు..కానీ బీజేపీ దాన్ని నిజం చేసి చూపించింది.హర్యానాలో జాట్ రాజకీయాల పట్టును విచ్ఛిన్నం చేయడం అసాధ్యం అన్నారు. కానీ వారు దానిని బద్దలు కొట్టారు. మహారాష్ట్రలో రాజకీయ సమీకరణాలను పూర్తిగా తలకిందులు చేశారు. సోకాల్డ్ "నకిలీ చాణక్యుల" వ్యూహాలను సమర్థవంతంగా తిప్పికొట్టారు. బీహార్‌లో తమ సొంత ముఖ్యమంత్రిని విజయవంతంగా నియమించుకున్నారు. రాబోయే 20–25 ఏళ్ల పాటు అక్కడి రాజకీయ ముఖచిత్రాన్ని తమకు అనుకూలంగా భద్రపరుచుకున్నారు. అసోంలో హ్యాట్రిక్ సాధించారు... అక్కడ రాజ్యమేలుతున్న లౌకికవాద, దేశ వ్యతిరేక రాజకీయాలను విజయవంతంగా కూకటివేళ్లతో పెకిలించారు. ఒకప్పుడు పశ్చిమ బెంగాల్ వామపక్షాలకు, మమతా బెనర్జీకి కంచుకోట; బీజేపీ వీరాభిమానులు సైతం "బెంగాల్‌లో మనం గెలవలేము" అని అంగీకరించేవారు... కానీ నేడు వారు ఆ అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేశారు. వామపక్షాలను జేఎన్‌యూ క్యాంపస్‌లకు, అడవులకే పరిమితం చేసే స్థాయికి తగ్గించారు.తమిళనాడులో త్వరలో బీజేపీ మద్దతుతో ప్రభుత్వం ఏర్పడబోతోంది... ఇక కేరళ విషయానికొస్తే --- వీరు దానిని కూడా కైవసం చేసుకుంటారు... ఆ సమయం దగ్గర పడుతోంది...పంజాబ్‌ను కూడా వీరు గెలుచుకుంటారు. వీరిద్దరి శకం ముగిసిపోతోందని ఎవరైనా భ్రమ పడుతుంటే... వారు తమ భ్రమల నుండి బయటకు రావాలి. వీరు రాజకీయ దిగ్గజాలు; వీరు ఇక్కడికి పాలించడానికి వచ్చారు. కనీసం ప్రస్తుత రాజకీయ వాతావరణంలోనైనా వారిని ఓడించగల సత్తా ఎవరికీ లేదు అని తెలిపారు.

# జీవ ఎరువులు పై అవగాహన కార్యక్రమం

- పి కుమార రాజా, దం ఆర్. సుబ్బరాజ్,

మనుబోలు, స్వర్ణసాగరం :

కోవూరు మండలం పాటూరు గ్రామంలో రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు అధ్వర్యంలో జీవన ఎరువులపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అధితులు డా. పి. కుమార రాజా, దం ఆర్. సుబ్బరాజ్, శాస్త్రవేత్తలు, సిఐబిఏ , చెన్నై, మాట్లాడుతూ రైతులు పంటలు లేని సమయంలో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుకుంటే అధిక దిగుబడులు సాధించి ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. సేంద్రియ ఎరువులు వాడనందున మన పొలంలోని నేల జీవం కోల్పోయి క్రమేణా పంట ఉత్పాదక శక్తి క్షీణిస్తుందని, క్రమేపీ రసాయనిక ఎరువుల మోతాదు పెంచవలసి వస్తుందని. కాలక్రమేణా, సూక్ష్మపోషకాల లోపాలు అధికమవుతాయని. దీనితో దిగుబడి తగ్గి ఖర్చు అధికమవుతుందని



చెప్పారు. నెల్లూరులోని జీవ నియంత్రణ ప్రయోగశాలలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతిలో లభించే జీవనఎరువులు వాడుకొని రసాయన ఎరువుల మోతాదు 25 శాతం వరకు తగ్గించుకోవాలని వివరించారు. సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యతను వివరిస్తూ రసాయన ఎరువుల వాడకం వల్ల జరిగే అనర్థాలను కోవూరు మండల సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి. జి. అనిత వివరించారు. అధిక మోతాదులో రసాయన ఎరువులను కుమ్మరించటం వల్ల భూభౌతిక స్థితి దెబ్బతిని నేల సారం క్షీణిస్తుందని. భూమిలో రసాయన ఎరువులు ముఖ్యంగా భాస్వరం నిల్వలు పెరిగిపోయి మొక్కల్లో సూక్ష్మ పోషక లోపాలు కనిపిస్తున్నాయని చెప్పారు. కాంప్లెక్స్ ఎరువుల్లోని భాస్వరం మొక్కలకు 20 శాతం అందితే మిగిలిన 80 శాతం భూమిలో పేరుకుపోతుందని. ఈ భాస్వరం నిల్వలను ఇలాగే వదిలేస్తే పంటల మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని. ఈ నిల్వలను జీవన ఎరువుల ద్వారా కరిగించి పైర్లకు అందేలా చేయవచ్చని. ఈ నిల్వలను పంటలకు ఉపయోగించుకోగలిగితే రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతోపాటు నేల మళ్లీ అధిక భాస్వరం లేకుండా ఆరోగ్యవంతంగా మారుతుందని. నేలలో పేరుకుపోయిన భాస్వరాన్ని కరిగించేందుకు జీవన ఎరువులు ఉపయోగడపడతాయని. ఈ జీవన ఎరువుల్లో పీఎస్‌బీ అనే సూక్ష్మజీవులు ఉంటాయని. ఈ జీవన ఎరువులను వాడడంతో భూమిలోని భాస్వరం కరిగి పంటలకు అందుతుందని. దీంతో జీవన ఎరువులు వాడడం ద్వారా 25 శాతం కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని. ఆ మేరకు రైతుకు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయని. ఎకరానికి 500 మీ.లి. ద్రవరూప జీవన ఎరువును (పీఎస్‌బీ) 100 కిలోల పశువుల ఎరువు, మట్టిలేక ఇసుకలో కలిపి ఆ మిశ్రమాన్ని ఆఖరు దుక్కిలో వెదజల్లాల్సి ఉంటుందని. జీవన ఎరువుల వినియోగం ద్వారా కాంప్లెక్స్ వినియోగం తగ్గించి పెట్టుబడులు ఆదా చేసుకోని దిగుబడులు 10 నుంచి 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ కార్ర్యమంలో కోవూరు మండల వ్యవసాయాధికారి శ్రీమతి. టి. రజనీ, కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు, శాస్త్రవేత్త డా. కె. కిరణ్ కుమార్ రెడ్డి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# 'తండ్రి లాంటి వ్యక్తిని కోల్పోయా' మోహన్ బాబు ఎమోషనల్




టాలీవుడ్ నటుడు, హీరో మోహన్ బాబు ప్రస్తుతం నాని హీరోగా వస్తోన్న ది ప్యారడైజ్ మూవీలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో విలన్ పాత్రలో అభిమానులను మెప్పించనున్నారు. ఇటీవలే మోహన్ బాబు క్యారెక్టర్ సంబంధించిన గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఇందులో మోహన్ బాబు లుక్ అదిరిపోయింది. దాదాపు 32 ఏళ్ల తర్వాత విలన్ పాత్రలో కనిపించనుండడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమా ఆగస్టు 21 ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా సంగతి పక్కనపెడితే మోహన్ బాబు డైరెక్టర్స్ డే 2026 ఈవెంట్‌కు హాజరయ్యారు. దివంగత దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ బాబు ఆసక్తికర కామెంట్స్ చేశారు. దాసరి నారాయణరావును తలచుకుని ఎమోషనలయ్యారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన బర్త్ డేను మనం సెలబ్రేట్ చేసుకున్నప్పటికీ.. చాలా బాధకరమైన రోజేనని అన్నారు. తండ్రి లాంటి వ్యక్తిని నేను కోల్పోయాననే బాధ నాకు జీవితమంతా ఉంటుందని తెలిపారు. ఎక్కడో ఉన్న నన్ను ఇండస్ట్రీకి తీసుకువచ్చి మోహన్‌బాబుగా ఈ స్థాయికి తీసుకొచ్చారని భావోద్వేగానికి గురయ్యారు. ఈ జనరేషన్ వాళ్లకు చాలామందికి డైరెక్టర్ అనే పదానికి అర్థం తెలియదు.. దర్శకుడు అనే పదానికి సరైన అర్థం చెప్పిన ఏకైక వ్యక్తి దాసరి నారాయణరావుగారే అన్నారు.

# క్రిస్టోఫర్ నోలన్ 'ద ఒడిస్సీ' తెలుగు ట్రైలర్



క్రిస్టోఫర్ నోలన్ పేరు చెబితే మూవీ లవర్స్ ఎగ్జైట్ అయిపోతారు. ఎందుకంటే ఈ దర్శకుడు తీసే సినిమాలకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ఒక పట్టానా అర్థం కావనే కామెంట్స్ వినిపిస్తాయి గానీ సూపర్ హిట్ అవడంతో పాటు వేల కోట్ల కలెక్షన్స్ గ్యారంటీ. ఈయన చేసిన లేటెస్ట్ మూవీ 'ద ఒడిస్సీ'. జూలై 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తాజాగా తెలుగు ట్రైలర్ కొత్తది రిలీజ్ చేశారు. ఇది విజువల్ వండర్‌లా ఉంటూ మూవీపై హైప్ పెంచుతోంది. ఒడియన్ అనే రాజు జీవితం ఆధారంగా ఈ సినిమా తీశారు. ఇందులో ఒడియన్ పాత్రలో మ్యాట్ డామన్, పెనెలోపీగా అన్నా హాత్వే, టెలిమాకస్‌గా టామ్ హోలండ్ కనిపించనున్నారు. రాబర్ట్ ప్యాటిన్‌సన్, ఛార్లెజ్ థెరోన్ కూడా కీలక పాత్రలు చేశారు. ఇంగ్లీష్‌తో పాటు భారతీయ భాషల్లోనూ ఈ మూవీని డబ్బింగ్ చేసి రిలీజ్ చేయబోతున్నారు. పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో మొత్తం షూటింగ్ పూర్తి చేయడం విశేషం. ట్రైలర్ బట్టి చూస్తే ఒడియన్ అనే రాజు, ఓ యుద్ధంలో పాల్గొనేందుకు తన రాజ్యాన్ని, భార్య కొడుకుని వదిలి మరో చోటకు వెళ్తాడు. యుద్ధం గెలిచి తిరిగొస్తుంటే సముద్రంలో ఇతడి సైన్యం ప్రయాణిస్తున్న ఓడ ప్రమాదానికి గురవుతుంది. కానీ ఒడియన్ రాజు ప్రాణాలు దక్కించుకుంటాడు. తర్వాత ఏమైంది? భార్య-కొడుకుని కలిశాడా అనేది మిగతా స్టోరీ. ప్రాచీన కవి హోమర్ రాసిన 'ద ఒడిస్సీ' పుస్తకం ఆధారంగా ఈ సినిమాని తెరకెక్కించారు.



# 'జన నాయగన్'కి శాపమే వరమైంది.. కనక వర్షం గ్యారెంటీ!

ఏది జరిగినా  మన మంచికే అనుకునే మనసు ఉంటే...ప్రతి కష్టం ఒక పాఠం అవుతుంది... ప్రతి ఓటమి ఒక అవకాశంగా మారుతుంది. ఇప్పుడు దళపతి విజయ్ విషయంలో ఇదే జరిగింది. ఎన్నికల ముందు ఆయనకు వరుస ఇబ్బందులు ఎదురయ్యాయి. భార్య సంగీతతో విడాకులు వివాదం.. మరోవైపు ప్రచారంలో తొక్కిసలాటలు, ఇంకోవైపు తన చివరి చిత్రం విడుదల వాయిదా పడడం.. ఇవన్నీ తట్టుకొని అలుపెరగకుండా ప్రచారం చేసి.. చివరకు రాజకీయ ప్రభంజనం సృష్టించాడు. తమిళనాడు రాష్ట్రానికి ఆయన సీఎం అయ్యే అవకాశముంది. ఒకవేళ అదే జరిగితే ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత విడుదలవుతున్న ఏకైక సినిమా 'జన నాయగన్' కాబట్టి.. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురవడం కూడా ఖాయమే.

**ఆలస్యమే ఆమృతం..**

ఆలస్యం అయితే అమృతం కూడా విషం అవుతుందంటారు. నిజమే కానీ 'జన నాయగన్' విషయంలో మాత్రం ఆలస్యమే అమృతం అయ్యేలా ఉంది. ఈ ఏడాది సంక్రాంతికి ఈ సినిమా విడుదల కావాల్సింది. కానీ పలు కారణాలతో వాయిదా పడింది. ఎన్నికల ముందు రిలీజ్ అయితే.. కొంతవరకు పొలిటికల్ కెరీర్‌కి కూడా ప్లస్ అవుతుందని విజయ్ భావించాడు. కానీ అది జరగలేదు. వాయిదా పడడమే కాదు.. అందులోని కొన్ని సన్నివేశాలు కూడా లీకయ్యాయి.  ఓటీటీ బిజినెస్ కూడా చేజారిపోయింది. ఇక జన నాయగన్ రిలీజ్ అవుతుందో లేదో అని చాలా మంది అనుకున్నారు. కానీ నిన్నటి ఫలితాలు అందరి అంచనాలను తలకిందులు చేసింది. 108 స్థానాల్లో టీవీకే పార్టీ గెలిచి.. ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. విజయ్ సీఎం అయిన తర్వాత జననాయగన్ విడుదల అవ్వడం ఖాయం. అప్పుడు ఈ సినిమాకు వచ్చే హైప్, క్రేజ్ వేరే లెవెల్ ఉంటుంది.

# ఎట్టకేలకు శుభవార్త చెప్పిన పటాస్ ప్రవీణ్



తెలుగులో రియాలిటీ షోలతో చాలాజంటలు పాపులారిటీ సంపాదించాయి. అలాంటి వాటిలో ప్రవీణ్-ఫైమా జోడీ ఒకటి. కలిసి స్కిట్స్ చేశారు. యూట్యూబ్ వ్లాగ్స్ కూడా చేశారు. ఒకరిపై ఒకరు ప్రేమ చూపించారు. దీంతో వీళ్లిద్దరూ ప్రేమలో ఉన్నారు. త్వరలో పెళ్లి చేసుకుంటారేమో అని అంతా అనుకున్నారు. కానీ ఫైమా తన జీవితంలో ప్రవీణ్ అనే మరో వ్యక్తి ఉన్నాడని అతడే తన ప్రియుడి అని సోషల్ మీడియాలో వెల్లడించింది. ఫైమాతో కలిసి నటించిన ప్రవీణ్ విషయానికొస్తే ఇప్పుడు మరో నటితో నిశ్చితార్థం చేసుకుని షాకిచ్చాడు. పలు ఆల్బమ్ సాంగ్స్‌లో చేసిన వంశిత అనే అమ్మాయితో పటాస్ ప్రవీణ్ ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలని తన సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేశాడు. దీంతో తోటి కమెడియన్స్ కొత్త జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. త్వరలో పెళ్లి వార్త కూడా చెప్పే అవకాశముంది. ప్రవీణ్ పెళ్లి చేసుకోబోతున్న వంశిత.. బంధువుల అమ్మాయి అని అంటున్నారు. పటాస్ ప్రవీణ్ విషయానికొస్తే చిన్నప్పుడే తల్లిని కోల్పోయాడు. నాలుగేళ్ల క్రితం బ్రెయిన్ ట్యూమర్‌తో తండ్రి కూడా చనిపోయాడు. ఇతడికి ఓ అన్న ఉన్నాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోబోతున్నాడు.

# 'టాక్సిక్'లో బోల్డ్ సీన్స్ వివాదం కియారా అద్వానీ క్లారిటీతో పుకార్లకు చెక్



కన్నడ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'టాక్సిక్' చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాలపై వచ్చిన వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. సినిమాలో తనపై చిత్రీకరించిన కొన్ని హాట్ సీన్స్‌ను తొలగించమని లేదా మార్చాలని కియారా మేకర్స్‌ను కోరిందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. టీజర్‌లో కనిపించిన గ్లామరస్ విజువల్స్ కారణంగా ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. దీంతో సినిమాలో ఘాటైన సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయన్న అంచనాలు ప్రేక్షకుల్లో పెరిగాయి. అయితే ఈ మొత్తం ప్రచారంపై కియారా అద్వానీ స్వయంగా స్పందిస్తూ స్పష్టమైన క్లారిటీ ఇచ్చింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన ఆమె.. "నేను ఎలాంటి సన్నివేశాల విషయంలోనూ మార్పులు కోరలేదు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమైన పుకార్లే" అని పేర్కొంది. దీంతో ఈ వివాదానికి పూర్తిగా తెరపడినట్లైంది.  ఈ చిత్రం టీజర్ విడుదలైనప్పటి నుంచి కియారా పాత్ర చుట్టూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆమె లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, సినిమా కథపై కూడా ఆసక్తిని పెంచింది. అయితే అధికారిక సమాచారం లేకుండానే పుట్టుకొచ్చిన ఊహాగానాలు ఒక్కసారిగా వైరల్ కావడం ఈ ఘటన ద్వారా మరోసారి స్పష్టమైంది. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. యష్ -- కియారా కాంబినేషన్ కూడా సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ప్రస్తుతం కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. అభిమానులు ఈ అప్డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో ధృవీకరించని వార్తలు ఎంత వేగంగా వ్యాప్తి చెందుతాయో 'టాక్సిక్' వివాదం మరోసారి నిరూపించింది. అధికారిక ప్రకటనలు లేకుండా వచ్చే వార్తలను నమ్మడంలో జాగ్రత్త అవసరమని ఈ సంఘటన సూచిస్తోంది .

Edited Printed Published & Owned by D A M A VIJAYA K U M A R. And Printed at V S R Printers, # 1-176, Vakadu Village and post, Vakadu Mandal, Tirupati District, Pin : 524415, A P.
Published at **VSR** Publications, H.No. 403, Panta Street, Chittoor, Andhra pradesh, Pin : 517501, **EDITOR DAMA VIJAYAKUMAR**, **RNI. NO. APTEL/26/A2367**